thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 96 | జగిత్యాల | శనివారం | 04 జూలై, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

స్వదేశంలో ఐదో కప్ పై ఇంగ్లండ్ గురి



11

# నాటి అప్పులు, తప్పులపై కేసీఆర్ స్పందించాలి

## బీఆర్ఎస్ అప్పులు అక్షరాలా రూ. 8,21,651 కోట్లు

**అనేక సంస్థలకు వేలకోట్ల బకాయిలు పెట్టిన ఘనులు**
**చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు**
**హరీష్ రావు అబద్దాలను కట్టిపెడితే మంచిది**
**డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్ట్రాంగ్ వార్నింగ్**



**తెలంగాణ బ్యూరో, జూలై 3:** గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్దాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు , బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని

మిగతా 2 లో



# అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు

**పూటకో మాట.. రోజుకో అడ్రస్‌లా జూపల్లి తీరు**
**ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసిందో తెలియని మంత్రివి నువ్వు**
**జూపల్లి లేఖకు సంగారెడ్డి వేదికగా హరీశ్ స్ట్రాంగ్ కౌంటర్**
**పీపీటీ ద్వారా కాంగ్రెస్ అప్పులపై కడిగి పారేసిన మాజీ మంత్రి**
**ఆర్‌బీఐ నుంచి 1,77,058 కోట్ల అప్పే చేశామన్న జూపల్లి**
**1.86 లక్షల కోట్ల అప్పు తీసుకొన్నట్టు ఆధారాలు చూపిన హరీశ్**
**చీమూనెత్తురుంటే వెంటనే స్పందించు..**
**జూపల్లికి బహిరంగ లేఖ పంపిన హరీశ్**

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై ఏమాత్రం అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు చీమూనెత్తురుంటే తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

03



## నా లెక్కలు తప్పని కేసీఆర్‌తో చెప్పించండి

**నాది తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తా.. మరి మీ సంగతేమిటి?**
**చర్చకు రాకుండా మీరు పారిపోయారు.. నిన్న అరెస్ట్ అయినందుకు రాలేదన్నారు . మరి ఇప్పుడెందుకు రాలేదు?**
**కేటీఆర్, హరీష్ రావులపై మంత్రి జూపల్లి ధ్వజం**

02

## 20వేల పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

**సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ**



## ఒవైసీ విద్యా సంస్థల వివరాలు ఎందుకివ్వరు?

**అధికారులను నిలదీసిన హైకోర్టు**
**వారంలోగా ఇవ్వాల్సిందే**
**లేదంటే ఉత్తర్వులు జారీ చేస్తాం**
**హెచ్చరించిన హైకోర్టు**

02

# రాష్ట్రంలో అద్దంలాంటి రోడ్ల నిర్మాణం



ఈ జూలై నెలలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం
నల్లగొండ-మహబూబ్ నగర్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి
వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు
6న కరీంనగర్ జిల్లా హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన
హై కోర్టు భవనం, ఉస్మానియా ఆసుపత్రి డిసెంబర్ కల్లా పూర్తి కావాలి
టిమ్స్,నిమ్స్,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ పూర్తి చేయండి
ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

# కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూదొందే!

## వారి డ్రామాలు బిగ్ బాస్ షోను తలపిస్తున్నాయి

**వారి వైఖరి చూసి జనం నవ్వు కుంటున్నారు**
**ఫోన్ ట్యాపింగ్ కేసులో జాప్యం ఎందుకు?**
**ఇక తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కార్**
**కేంద్ర మంత్రి బండి సంజయ్**

03

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు నడుపుతు న్నారనీ, వాస్తవానికి ఆ రెండూ ఒక్కటేనని కేంద్ర న హాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. వారి ఛాలెంజ్ డ్రామాలు బిగ్ బాస్ షోను తలద న్నేలా ఉన్నాయని విమర్శించారు. శు క్రవారం కరీం నగర్ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ వాళ్ల నాటకాలను, మీడియా కవరేజీ కోసం రెండు పార్టీలు పడుతున్న తంటాలను చూసి జనం నవ్వు కుంటున్నారని మండిపడ్డారు.



## అయోధ్య చోరీపై ఆర్ఎస్ఎస్ ఆందోళన

**దోషులను కఠినంగా శిక్షించాల్సిందే**
**హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలరాదు**
**ఈ ఘటనతో హిందూ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదు**
**విచారం వ్యక్తం చేసిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధి దత్తాత్రేయ హోసబలే**

04

## గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు



**వెలుగులోకి జైష్-ఎ-మహ్మద్ కుట్ర**
**మధ్యప్రదేశ్‌లో 8 మంది అరెస్ట్**

# ఒవైసీ విద్యా సంస్థల వివరాలు ఎందుకివ్వరు?

**అధికారులను నిలదీసిన హైకోర్టు.. వారంలోగా ఇవ్వాల్సిందే**

**లేదంటే ఉత్తర్వులు జారీ చేస్తాం.. హెచ్చరించిన హైకోర్టు**

**హైదరాబాద్ :** సల్కం (సు(్రం) చెరువు పరిధిలో బారిస్టర్ ఫాతిమా ఒవైసీ విద్యా సంస్థల భవన నిర్మాణాలు, వాటికి మంజూరైన అనుమ తులు, విద్యాసంస్థ నిర్వహణకు ఇచ్చిన అనుమతులపై సంబంధిత ప్రభుత్వ శాఖలు ఇప్పటికీ పూర్తి వివరాలు సమర్పించకపోవడంపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇప్పటికే ఏప్రిల్ 13, ఏప్రిల్ 30 తేదీల్లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి మూడు నెలలకు పైగా గడువు ఇచ్చినా సంబంధిత శాఖలు నిర్దిష్ట సమాచారం సమర్పించలేదని తప్పుబట్టింది. ఇదే చిట్టచివరి అవకాశ మని తేల్చి చెప్పింది. వారంలోగా అన్ని నివేదికలు, అనుమతులకు సంబంధించిన పత్రాలు, గత ఉత్తర్వుల మేరకు తీసుకున్న చర్యల వివరాలు కోర్టు ముందు ంచాలని ఆదేశించింది. లేనిపక్షంలో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని హెచ్చరించింది గడువులోగా పూర్తి వివరణలు దాఖలు చేయకపోతే తగిన ఉత్తర్వులు జారీ చేయాల్సి వస్తుం దని న్యాయమూర్తి జస్టిస్ శ్రవణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం 2.15 గంటలకు వాయిదా వేశారు. సల్కం చెరువును ఆక్రమించి ఒవైసీ విద్యా సంస్థల భవన నిర్మాణాలు చేపట్టారని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఓ న్యాయవాది దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం పై విచారణ సందర్భంగా నీటిపారుదల శాఖ తరపు న్యాయ వాది వాదనలు వినిపించారు. ప్రధాన ఇంజనీర్ సూచనల మేరకు మే 15న సంయుక్త తనిఖీ నిర్వహించామని, చెరువు ప్రస్తుత పరిస్థితులు, రింగ్బండ్, నీటి వ్యాప్తి ప్రాంతాన్ని పరిశీ లించామని తెలిపారు. రెవెన్యూ శాఖ నుంచి గ్రామ పటాలపై సూపర్ ఇంపోజ్ చేసిన మ్యాపులు, స్కెచ్లు, సమగ్ర నివేదిక కోరామని, అవి అందిన తర్వాత పూర్తినివేదిక సమర్పిస్తామని వివరించారు. దీనిపై పిటిషనర్ తరపు న్యాయవాది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2013లోనే సర్వే పూర్తై. 2014లో సంబంధిత అధికారులు మ్యాప్పై సంతకాలు చేశారని, 2016లో చెరువు ఎఫ్ఎఎల్కు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ కూడా జారీ అయిందని కోర్టు దష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఖరారైన ఎఫ్ఎల్ను ఇప్పుడు మళ్లీ పునఃపరి శీలించే ప్రయత్నం నీటిపారుదల శాఖ చేస్తోందని ఆరోపిం చారు. పహాణి రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 62/1లో 36.03 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నాయని, చెరువు విస్తీర్ణానికి సంబంధించిన అధికారిక రికార్డులు ఇప్ప టికేఅందుబాటులో ఉన్నాయని వాదించారు. పాఠశాల విద్యాశాఖ తరపు న్యాయవాది వాదిస్తూ ఒవైసీ విద్యా సంస్థ లో పదో తరగతి నిర్వహణకు తమ శాఖ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. రాతపూర్వక వివరణ సమర్పించేందు కు కొంత గడువు కావాలని కోరారు. ఇంటర్, డిగ్రీ తదితర కోర్సుల నిర్వహణకు సంబంధించిన అనుమ తుల విషయం లో ఉన్నత విద్యాశాఖ సమాధానం ఇవ్వాల్సి ఉందని కోర్టుకు తెలిపారు. గత విచారణలో కూడా బారిస్టర్ ఫాతిమా ఒవైసీ విద్యా సంస్థ నిర్వహణకు తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు జారీ కాలేదని మౌఖికంగా వివరించినట్లు పేర్కొన్నారు. హెచ్ఎండీఏ తరపు న్యాయవాది వాదిస్తూ సల్కం చెరువు లేక్ ప్రొటెక్షన్ కమిటీ పరిధిలోకి వస్తుందని, అవసరమైన సమాచారం అందించాలని ఇప్పటికే సంబం ధిత శాఖలకు లేఖలు పంపినట్లు తెలిపారు. హైడ్రా తరపు న్యాయవాది స్పందిస్తూ చెరువులోని నిర్మాణాలకు సంబం ధించిన అన్ని శాఖల వివరాలు, పత్రాలు కోరామని, అవి అందిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని వివరిం చారు. జీహెచ్ఎంసీ తరపు న్యాయవాది మాట్లాడుతూ చెరువుకు సంబంధించిన తుది నోటిఫికేషన్, ఎఫ్ఎఎల్ పరిమితులు, బఫర్ జోన్ ఖరారు ప్రక్రియ కొనసాగు తోంద న్నారు. మే నెలలో సంయుక్త తనిఖీ నిర్వహించామని, ఓటరు జాబితా సవరణ తదితర పరిపాలనా కార్యక్రమాల కారణం గా హైకోర్టు ఆదేశాల మేరకు ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయలేకపోయామని తెలిపారు. పూర్తి నివేదిక సమర్పి ంచేందుకు మరో నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరారు. ఈ వాదనలను పరిశీలించిన న్యాయమూర్తి తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలల గడువు ఇచ్చినా ఏ శాఖ క రీడా నిర్దిష్ట సమాచారం కోర్టుకు అందించలేదని వ్యాఖ్యా నించారు. ముఖ్యంగా సల్కం చెరువు పరిధిలో ఒవైసీ విద్యా సంస్థల భవన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు ఇచ్చిందా లేదా అన్న విషయంపై ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. అలాగే విద్యాసంస్థ నిర్వహణకు విద్యాశాఖ నుంచి అనుమతులు మంజూరయ్యాయా లేదా అన్న అంశంపై కూడా పూర్తి సమాచారం సమర్పించలేదని పేర్కొన్నారు. విద్యాసంస్థల తరఫు న్యాయవాదులు కూడా సంబంధిత అనుమతుల ప త్రాలను కోర్టు ముందు ఉంచలేదని, ఇది ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఒవైసీ విద్యా సంస్థలకు మంజూరైన అన్ని అనుమతులు, భవన నిర్మాణాలకు జీహెచ్ఎంసీ ఇచ్చిన అనుమతులు, విద్యాసంస్థ నిర్వహణకు సంబంధించిన అనుమతులు, చెరువు ఎఫ్ట ఎల్, బఫర్ జోన్ నిర్ధారణకు సంబంధించిన పూర్తి నివేదిక, అలాగే ఏప్రిల్ 30న ఇచ్చిన ఆదేశాల అమలుపై సమగ్ర నివేదిక ను వారంలోగా దాఖలు చేయాలని ఆదేశించింది. ఇదే చివరి అవకాశమని స్పష్టం చేసిన హైకోర్టు, ఇకపై ఎలాంటి జాప్యాన్ని సహించబోమని హెచ్చరించింది. నిర్దేశించిన గడువులోగా అధికారులు పూర్తి వివరాలు సమర్పించకపోతే తగిన ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేస్తూ విచారణను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది.

## ఘట్కేసర్ వద్ద రైలుకిందపడి దంపతుల ఆత్మహత్య

**వరంగల్ జిల్లా పాపయ్యపేట దంపతులుగా గుర్తింపు**

**హైదరాబాద్,జూలై 3 :** మేడ్చల్ జిల్లాలోని ఘట్కేసర్ సమీపంలో రైలు కిందపడి దంపతులు మృతిచెందిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. గురువారం రాత్రి ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. మృతులు వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామానికి చెందిన రవికుమార్, శిరీషగా గుర్తించారు. ఘట్కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఘట్కేసర్–బీబీనగర్ రైల్వే మార్గంలో రైలు కిందపడి దంపతులు మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరి మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దంపతుల మృతి సమాచారాన్ని కుటుంబసభ్యులకు తెలియజేశారు. రవికుమార్, శిరీష మృతితో పాపయ్యపేట గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## లాడ్జిలో యువతి అనుమానాస్పద మృతి

**యువతితో కలిసి వచ్చిన ఫారూఖ్ అనే వ్యక్తి అరెస్ట్**

**హైదరాబాద్,జూలై3 :** నగరంలోని లంగర్హౌస్ పరిధిలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. మృతురాలిని రేణుక(26)గా పోలీసులు గుర్తించారు. హోటల్ గ్రాండ్ లాడ్జిలో సదరు యువతి ఫ్యాన్కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించినట్లు తెలిపారు. ఫారూఖ్ అనే వ్యక్తితో కలిసి రేణుక హోటల్లో గది బుక్ చేసుకుంది. అనంతరం ఫారూఖ్ బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి రేణుక ఫ్యాన్కు ఉరివేసుకున్న స్థితిలో కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. అయితే.. ఇది ఆత్మహత్య కాదని, తమ కుమార్తెను హత్య చేశారని యువతి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న లంగర్హౌస్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఫారూఖ్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. యువతిది హత్యా, ఆత్మహత్యా అనే దానిపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన లంగర్హౌస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లంగర్హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎండీ లైన్స్ వద్ద ఉన్న లాడ్జిలో రేణుక (26) అనే యువతి అనుమానాస్పద స్థితిలో మృతి ఘటన చోటు చేసుకుంది. అల్వాల్కు చెందిన రేణుకకు గోల్కొండ ప్రాంతానికి చెందిన ఫారుక్ (34)తో పరిచయం ఉంది. ఈ క్రమంలో ఇద్దరూ నిన్న రాత్రి హోటల్లో గదిని (రూమ్ నం.1611) బుక్ చేసుకున్నారు. తాను కొద్దిసేపు బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి రేణుక ఉరివేసుకుని కనిపించిందని ఫారుక్ పోలీసులకు తెలిపాడు. అయితే, రేణుక కుటుంబ సభ్యులు ఇది ఆత్మహత్య కాదు.. హత్యేనని ఆరోపిస్తూ ఫారుక్పై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయని పోలీసులు తెలిపారు.

# నాటి అప్పులు, తప్పులపై కేసీఆర్ స్పందించాలి

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్కు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను



తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్దాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్దాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్రావు అనేక విషయాలపై అబద్దాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్దాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్టాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ.8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు?అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ.2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్దాలు చెబుతున్నారు' అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నా లెక్కలు తప్పని కేసీఆర్తో చెప్పించండి

**నాది తప్పని నిరూపిస్తే రాజీనామా చేస్తా**
**మరి మీ సంగతేమిటి?**
**చర్చకు రాకుండా మీరు పారిపోయారు**
**నిన్న అరెస్ట్ అయినందుకు రాలేదన్నారు . మరి ఇప్పుడెందుకు రాలేదు?**
**కేటీఆర్, హరీష్రావులపై జూపల్లి ధ్వజం**
**ప్రెస్ క్లబ్లో చర్చ కోసం 3 కుర్చీలు ఏర్పాటు**




**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పులపై బహిరంగ చర్చకు రాకుండా కేటీఆర్, హరీష్ రావు పారిపోయారని, ఇప్పటికైనా మీరు చేసిన అప్పులు రూ. 8.21,651 కోట్లుగా అంఖకరించాలని రాష్ట్ర ఆబ్కారిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు డిమాండ్ చేశారు. తాను చెప్పిన లెక్కలు తప్పని నిరూపిస్తే ఎమ్మెల్యే మంత్రి పదవులకు రాజీనామా చేస్తానని ఇది వరకే ప్రకటించానని, ఆ ప్రకటనకు ఇప్పటికీ కట్టుబడి ఉ న్నానని, ఆ విషయం మీరెందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు శు క్రవారం సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్ క్లబ్కు రావాలని గురువారం బీఆర్ఎస్ నేతలను జూపల్లి ఆహ్వానించిన విషయం తెలిసిందే అందులో భాగంగా శు క్రవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్కు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్తో పాటు వచ్చారు. బీఆర్ఎస్ నేతలు రాకపోవడంతో మంత్రి జూపల్లి మీడియాను ఉ ద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ 1 నాటికి చేసిన అప్పులపై చర్చకు రావాలని హరీష్ రావుకు 4 పేజీల లేఖ, కేసీఆర్ కు 5 పేజీల లేఖ రాసినట్లు చెప్పారు. వారి హయాంలో చేసిన అప్పులు ఎన్ని? వాటి లెక్కలు చెప్పాలని సవాల్ విసిరానని, తాను అడిగిన వాటికి సమాధానం సరిగ్గా చెప్పకుండా దాట వేశారని విమర్శించారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఉన్న అప్పులు కేవలం రూ.72,658 కోట్లుకాగా, చీఆర్ఎస్ అధికారం చేపట్టినప్పటి నుంచి 2023 డిసెంబర్ 1న దిగిపోయేనాటికి ఉన్న అప్పులు, పెండింగ్ బిల్లులు కలిపి రూ.8,21,651 కోట్లు ఉన్నా యని స్పష్టం చేశారు. తాను చెప్పిన లెక్కలు తప్పని కేసీఆర్ తోనే చెప్పించాలని జూపల్లి డిమాండ్ చేశారు. పరిస్థితి ఇలా ఉండగా, తమ పదవీకాలంలో కేవలం రూ.4.17 లక్షల కోట్లు మాత్రమే తీసుకున్నట్లు హరీష్ రావు అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పూచికత్తుతో చేసిన అప్పులను లెక్కలోకి తీసుకోరా? అవి అప్పులు కాదా అని ప్రశ్నించారు. మీరు చేసిన అప్పులకు ప్రతి నెలా రూ. 6 వేల కోట్లు అసలు, వడ్డీలు కడుతున్నామని చెప్పారు. కాళేశ్వరం ఇతర కార్పోరేషన్లకు రూ.88,651 కోట్లు వాటర్ గ్రిడు రూ. 20, 200 కోట్లు, విద్యుత్ సంస్థలకురూ.85,193 కోట్లు, సివిల్ సప్లయిసక్కురూ. 56,146 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ. 6,470 కోట్ను రోడ్ డెవలప్మెంట్ కు రూ.4,221 కోట్లు, జీహెచ్ఎంసీ ద్వారా చేసిన అప్పులు రూ.4,906 కోట్లు వాటర్ వర్బ్ కు రూ.2,952 కోట్లు, అప్పులు తీసుకున్నారని వాటి లెక్కలు ఎందుకు చెప్పడం లేదని జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు పాలమూరు పౌరుషం ఉంటే అని అన్నారని, ఎస్ తనకు పాలమూరు పౌరుషం ఉందని, అందుకే ఆనాడు మంత్రి పదవికి రాజీనామా చేశానని, ఉమ్మ డిపాలమూరు జిల్లాలో ఆనాడు మెజారిటీ ఎమ్మెల్యేల స్థానాలను గెలిపించానని చెప్పారు. దమ్ము ధైర్యం అంటూ హరీష్ రావు చేతకాని మాటలు మాట్లాడు తున్నారని. అడిగిన దానికి సమాదానం చెప్పకుండా దాటవేసిన మీని చేతకాని మాటలు కాదా అని ప్రశ్నం చారు. ఇప్పటికైనా అబద్ధాలు చెప్పకుండా విలువలతో బతకాలని హరీష్ రావును కోరారు. మీ పరిపాలన సక్కగా ఉంటే నేడు ఈ పరిస్థితి మీకు ఎందుకు వచ్చేదన్నారు. తెలంగాణ ఉద్యమ పవిత్రతకు, అమర వీరుల ఆకాంక్షలకు అనుగుణంగా కేసీఆర్ పాలన సాగలేదని జూపల్లి ధ్వజమెత్తారు. లెక్క తప్పటం, మాట తప్పడం మా ఇంటా వంటా లేదని, హరీష్ రావు రాసిన లేఖలో సొల్లు తప్ప ఇంకేమీ లేదు. అడిగిన దానికి సమాధానం చెప్పకుండా దాటవేశా రని మంత్రి నిప్పులు చెరిగారు. నిన్న పోలీసులు అరెస్టు చేసినందువల్ల చర్చకు రాలేదని బూటకపు మాటలు మాట్లాడారని, ఈ రోజు రావడానికి ఇబ్బందేముం దని, డొంక తిరుగుడు మాటలు కాదని, 6 ఫీట్ల మాటలు కాదని, సూటిగా సమాధానం చెప్పాలని కోరారు. మీలాగా చీము, నెత్తురు లేని వాడిని కానని, వాస్తవాలే చెబుతానని జూపల్లి అన్నారు.

**కేసీఆర్, కేటీఆర్, హరీష్ కోసం ప్రత్యేకంగా 3 కుర్చీలు**

బహిరంగ చర్చ కోసం కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు కూర్చునేందుకు 3 ఖాళీ కుర్చీలను వేయ డం విశేషం. వేదికపై ఎడమవైపు ఈ కుర్చీలను వేశారు. ఈ విష యాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా ప్రక టించారు. వేదికపై జూపల్లితో పాటు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కూర్చున్నారు. ఖాళీ కుర్చీలు బీఆర్ఎస్ అగ్రనేతల కోసం వేసిన విషయాన్ని గమనించని మంత్రి పొన్నం వాటిపై కూర్చునేం దుకు ప్రయత్నించగా, ఆ కుర్చీలు మీ కోసం కాదు, వారి కోసం వేశామని చెప్పి పొన్నలను తన పక్కన ఎడమవైపు జూపల్లి కూర్చోబెట్టుకు న్నా రు. హరీష్ రావు కోసం కొద్ది సేపు మంత్రి వేచి ఉన్నారు. వారు రావడం లేదని మీడియాతో మాట్లాడారు. ముందుగా ప్రకటించిన విధంగానే బహిరంగ చర్చకు మంత్రి జూపల్లి సాయంత్రం 4.50 గంటలకు ప్రెస్ క్లబ్ చేరుకున్నారు. 5 గంటల సమయం చూసుకుని వేదికపై కూర్చున్నారు. ఆయనతో పాటు పొన్నం ప్రభాకర్, వీర్లపల్లి శంకర్ కూడా వచ్చారు. హరీష్ రావు, కేటీఆర్ కోసం జూపల్లి కొద్ది సేపు వేచి ఉన్నారు. వారు రా కాకపోవడంతో మీడియాతో మాట్లాడారు. 25 నిమిషాల పాటు మాట్లాడారు. ఆ తర్వాత ప్రెస్ క్లబ్ కమిటీ ఆహ్వానం మేరకు కమిటీ హాలులో వేసి ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి కూ డా చేరుకున్నారు.5.50 గంటలకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్య కర్తలు వచ్చారు. ఎలాంటి అవాంచనీయ ఘటలను జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వెంటవెంటనే రైతు భరోసా నిధుల విడుదల

**నాలుగు రోజుల్లో రూ.6,590.37 కోట్ల జమ**

హైదరాబాద్,జూలై3 రైతు భరోసా పథకం అమలులో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. కేవలం నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.6,590.37 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసి రికార్డు సృష్టించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నేడు నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల భూమి ఉ న్న రైతులకు రూ.1,188 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ విడతలో 4.41 లక్షల మంది రైతులు లబ్ది పొందినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా సాయం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## స్వాధీనం చేసుకున్న విమానం వేలం

**దేశంలో తొలిసారిగా ఈడీ సంచలన నిర్ణయం**

హైదరాబాద్,జూలై3 : దేశంలోనే తొలిసారిగా ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఈడీ స్వాధీనం చేసుకున్న ఓ విమానాన్ని ఈ–వేలం ద్వారా విక్రయించింది. హైదరాబాద్ జోనల్ ఈడీ స్వాధీనం చేసుకున్న హాకర్ 800 విమానాన్ని విక్రయించేందుకు ఈ నెల 1న ఎంఎస్టీసీ ద్వారా ఆక్షన్ నిర్వహించగా.. రూ.3 కోట్లకు అమ్ముడుపోవడం విశేషం. హాకర్ 800 విమానం అనేది అంతకుముందు ఫాల్కన్ పోంజీ కేసు ప్రధాన నిందితుడు అమర్దీప్ కుమార్కు చెందినది. అయితే అమర్దీప్ నకిలీ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో రూ.792 కోట్ల మోసానికి పాల్పడినట్టు ఈడీ తేల్చింది. దర్యాప్తులో భాగంగా ఈ విమానాన్ని గత మార్చి 7న ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత.. చట్టపరమైన పక్రియ ద్వారా, పీఎంఎల్ఏ అడ్జుడికేటింగ్ అథారిటీ అనుమతితో దీనిని ఈ–వేలంలో రూ.3 కోట్లకు విక్రయించారు. ఈ సొమ–్మను బాధిత పెట్టుబడిదారులకు తిరిగి చెల్లించనున్నారు. కాగా.. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ అవ్వగా, దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు ఈడీ తెలిపింది. అయితే.. ఈడీ స్వాధీనం చేసుకున్న విమానాన్ని పూర్తిగా ఆన్లైన్ విధానంలో విక్రయించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఆస్తుల విక్రయ పక్రియలో పారదర్శకత, పోటీ వాతావరణం కల్పించడం సహా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచే దిశగా ఈ విధానం ఉపయుక్తమవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు

**పూటకో మాట.. రోజుకో అడ్రస్‌లా జూపల్లి తీరు**
**ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసిందో తెలియని మంత్రివి నువ్వు**
**జూపల్లి లేఖకు సంగారెడ్డి వేదికగా హరీశ్ స్ట్రాంగ్ కౌంటర్**
**పీపీటీ ద్వారా కాంగ్రెస్ అప్పులపై కడిగి పారేసిన మాజీ మంత్రి**
**ఆర్‌బీఐ నుంచి 1,77,058 కోట్ల అప్పే చేశామన్న జూపల్లి**
**తనకు పంపిన లేఖలో పదివేల కోట్ల అప్పులు**
**తక్కువగా చూపారని విమర్శ**
**జూపల్లికి బహిరంగలేఖ పంపిన హరీశ్**



**సంగారెడ్డి జూలై 3 :** కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు, బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులపై ఏమాత్రం అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు చీమూనెత్తురుంటే తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా తనకు సవాల్ విసరడంతోపాటు వాట్సాప్‌లో లేఖ రాయడంపై హరీశ్‌రావు సంగారెడ్డిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం వేదికగా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సొంత ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసిందో? కూడా తెలియని, చేతకాని మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత అప్పు చేసింది, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత అప్పు చేసింది? అన్న అంశంపై సాధికారక లెక్కలు సహా హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి జూపల్లికి సమాధానం ఇచ్చారు. అంతటితో ఆగకుండా అక్కడికక్కడే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్నికోట్లు అప్పులు చేసింది. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని అప్పులు చేసిందన్న అంశంపై స్పష్టత ఇచ్చే అంశంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు మాట్లాడిన వీడియోలు, ఆర్‌బీఐ పత్రాలు, లేఖను మంత్రికి వాట్సాప్ చేశారు. తన లేఖ చూసిన వెంటనే జూపల్లి స్పందించాలని డిమాండ్ చేశారు.

## పీపీటీ ద్వారా స్ట్రాంగ్ కౌంటర్

సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన ఎస్ఐఆర్‌పై బీఎల్ఏలకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేదికపై ఉండగానే హరీశ్‌రావుకు మంత్రి జూపల్లి నుంచి వాట్సాప్‌లో లేఖ వచ్చింది. ఆ లేఖపై హరీశ్‌రావు అప్పటికప్పుడు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో మంత్రి జూపల్లికి స్ట్రాంగ్‌కౌంటర్ ఇచ్చారు. గురువారం ఆగమాగం అయిన కాంగ్రెస్ పార్టీ డ్యామేజీ కంట్రోల్‌లో పడిందని ఎద్దేవా చేశారు. గోల్ చేద్దామనుకొన్న కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్ చేసి పప్పులో కాలేసిందని చెప్పారు.

## జూపల్లి ఇవిగో అప్పులు

పీపీటీ ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన అప్పుల గురించి హరీశ్‌రావు సవివరంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌బీఐ ద్వారా ఇప్పటివరకు రూ.1,77,058 కోట్ల అప్పులు చేసినట్టు జూపల్లి తనకు రాసిన లేఖలో పేర్కొన్నారని చెప్పారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌బీఐ నుంచి ఎఫ్ఆర్ఎంబీ ద్వారా రూ.1,86,087 కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. ఈ మేరకు ఆర్‌బీఐ విడుదల చేసిన ఎఫ్ఆర్ఎంబీ అప్పుల జాబితాను ప్రదర్శించారు. ఆర్‌బీఐ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం 175 సార్లు ఆ అప్పులు చేసిందని వివరించారు. ఈ వివరాలు ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు. మంత్రి జూపల్లి తనకు రాసిన లేఖలో రూ.10వేల కోట్ల అప్పులు తగ్గించి చూపారని, ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసిందో జూపల్లికి తెలియకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేసిన అప్పులపై అసెంబ్లీ వేదికగా తాను సీఎం రేవంత్‌రెడ్డిని మార్చి 18,2026న ప్రశ్నించినట్టు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఫిబ్రవరి 2026 వరకు రూ.3,47,294 కోట్ల అప్పులు చేసినట్టు సీఎం రేవంత్‌రెడ్డి నిండు అసెంబ్లీ సాక్షిగా చెప్పారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన వీడియోను హరీశ్‌రావు ప్రదర్శించారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులు ఇప్పటి వరకు రూ.4.50 లక్షల కోట్లు దాటిందని తెలిపారు. లేఖ రాసిన అరగంటలోనే కాంగ్రెస్ చేసిన అప్పులపై జూపల్లి చెప్పిన లెక్కలు తప్పని ఆధారాలతో బయటపెట్టామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులకు ప్రభుత్వాన్ని నడుపరాక బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శించారు.

## సంగమేశ్వర, బసవేశ్వర కోసం పాదయాత్ర

సంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ ప్రారంభించిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా నిలిపివేసిందని, వాటిని వెంటనే ప్రారంభించకపోతే జిల్లా రైతులతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హరీశ్‌రావు హెచ్చరించారు. ఆ పథకాల కోసం రైతులతో కలిసి తాను పాదయాత్ర చేస్తానని స్పష్టంచేశారు. 4 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ఆ పథకాలకు కాంగ్రెస్ నిధులు ఇవ్వడం లేదని విమర్శించారు.

## బీఆర్ఎస్ సర్కార్ అప్పు 4.17 లక్షల కోట్లే

బీఆర్ఎస్‌హయాంలో చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం, మంత్రులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని హరీశ్‌రావు స్పష్టంచేశారు. 'బీఆర్ఎస్ పాలనలో తీసుకొన్న రుణాలు, ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చి చెల్లిస్తున్న రుణాలన్ని కలిపినా మొత్తం రూ.4.17 లక్షల కోట్లు మాత్రమేనని నేను అప్పట్లోనే అసెంబ్లీ సాక్షిగా స్పష్టం చేశాను. నేను చెప్పిన ఆ లెకలకు నేటికీ కట్టుబడి ఉన్నా. దీనిపై ఎకడైనా చర్చకు సిద్ధం' అని సవాల్ విసిరారు. ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు శుక్రవారం రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. సంబంధిత వీడియోలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలు తదితర ఆధారాలను జూపల్లి వాట్సాప్‌నకు పంపారు. ఆధారాలు సహా ఎన్నిసార్లు వివరించినా కాంగ్రెస్ నేతలు తీరు మార్చుకోకపోవడం శోచనీయమని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 2026 ఫిబ్రవరి వరకు రూ.3,47,294 కోట్ల అప్పులు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి నిండు అసెంబ్లీ సాక్షిగా చెప్పారు. ఆ తర్వాత ఇప్పటి వరకూ కాంగ్రెస్ సర్కార్ చేసిన మొత్తం అప్పులు రూ.4.50 లక్షల కోట్లు దాటి ఉంటుంది. మంత్రి జూపల్లి కృష్ణారావు మాత్రం రూ.1.77 కోట్లే ఆర్‌బీఐ ద్వారా సర్కార్ అప్పులు చేసిందని ఆయన నాకు రాసిన లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులపై నువ్వు చెప్పింది కరెక్టా? అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చెప్పింది కరెక్టా? జూపల్లి నిజంగా పాలమూరు బిడ్డవైతే, చీమూనెత్తురు ఉంటే తక్షణమే ఆయన తన పదవికి రాజీనామా చేయాలి.

# 20వేల పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

## సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్ :** రాష్ట్రంలో వెంటనే 20.వేల పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పోలీస్ ఉద్యోగార్థుల సమస్యలు, డిమాండ్లను వివరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన శుక్రవారం ఒక బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు 17 వేల పోలీస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్టీఐ ద్వారా తేలిందని, స్వయం గా సీఎం కూడా గతంలో 12 వేల ఖాళీలు ఉన్నాయని చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం 5 వేల పోస్టులతో సరిపెట్టడం 15 లక్షల మంది నిరుద్యో గులను వంచించడమేనని మండిపడ్డారు. నోటిఫి కేషన్లు ఆలస్యమవ్వడం వల్ల నిరుద్యోగులు నష్టపోతున్నారని, అందుకే కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 36 ఏళ్లకు, ఎస్సై అభ్యర్థుల వయోపరిమితిని 37 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించి 20 వేల ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని, లేనిపక్షంలో నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ భారీ ఎత్తున ఆందోళనలు చేపడుతుందని కేటీఆర్ హెచ్చరించారు.

## విద్యార్థినుల చదువుకు భరోసా

కేటీఆర్ తన 50వ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ ఏడాది నుంచి 50 మంది యువతుల ఉన్నత చదువులకు అయ్యే ఖర్చును తన వ్యక్తిగత నిధుల నుంచి వెచ్చించనున్నట్టు ప్రకటించారు. శుక్రవారం హైదరాబాద్ ఫిల్మ్ నగర్ లో జరిగిన స్పర్శ 2026 వార్షిక సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన ఆయన టచ్ ఏ లైఫ్ థీమ్తో మహిళల విద్య, స్కిల్ డెవలప్మెంట్, ఉపాధి కోసం స్పర్శ చేస్తున్న కృషిని కొనియాడారు. నటి అక్కినేని అమల పాల్గొన్న ఈ కార్యక్రమంలో, వేలాది మంది మహిళల జీవితాల్లో మార్పు తెస్తున్న సంస్థ నిర్వాహకులను కేటీఆర్ అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూదొందే!

**వారి డ్రామాలు బిగ్ బాస్ షోను తలపిస్తున్నాయి**
**వారి వైఖరి చూసి జనం నవ్వు కుంటున్నారు**
**ఫోన్ ట్యాపింగ్ కేసులో జాప్యం ఎందుకు?**
**ఇక తెలంగాణలోనూ డబుల్ ఇంజన్ సర్కార్**
**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్ :** రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు నడుపుతు న్నారనీ, వాస్తవానికి ఆ రెండూ ఒక్కటేనని కేంద్ర న హాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. వారి ఛాలెంజ్ డ్రామాలు బిగ్ బాస్ షోను తంద నన్నేలా ఉన్నాయని విమర్శించారు. శుక్రవారం కరీం నగర్ జిల్లా కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాళ్ల నాటకాలను, మీడియా కవరేజీ కోసం రెండు పార్టీలు పడుతున్న తంటాలను చూసి జనం నవ్వు కుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలేనని, ఈ రెండు పార్టీలను తెలంగాణ ప్రజలు ఎలిమినేషన్ చేయబోతున్నా రన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో అది సాధ్య మవుతుందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉంటే తెలంగాణ అభివృద్ధి పదంలో దూసుకు వెళ్తుందన్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వల ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందని కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టిందని, అయినా ఇంత వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. గత ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ ప్రత్యర్థులను వేధించడానికి వాళ్ల ఫోన్ నెంబర్లను కూడా ట్యాపింగ్ చేయించారన్నారు. ఈ కేసు విచా రణను ఎప్పుడు పూర్తి చేస్తారో.. బాధ్యులను ఎప్పుడు అరెస్ట్ చేస్తారో చెప్పాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు జాప్యం వెనుక కారణాలేమిటిలో వివరణ ఇవ్వాలన్నారు. సింగరేణిలో బొగ్గు మాయంపై తక్షణ విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని, రాష్ట్రానికి చేతగాకపోతే కేంద్రాన్ని కోరితే విచారణ జరిపి దోషుల సంగతి చూసేందుకు రాము సిద్ధమని ప్రకటించారు.

## ఉపాధి హామీకి రూ.8 లక్షల కోట్ల ఖర్చు

ఉపాధి హామీ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసిందనీ, తెలంగాణలోనూ రూ.30 వేలకోట్లు ఖర్చు చేశామన్నారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా ఆస్తుల వృష్టి సరిగా జరగలేదని, వీబీ-జీ రామ్ జీ స్కీం ద్వారా ఆస్తులను సృష్టించబోతున్నామని పేర్కొన్నారు. కూలీలకు కచ్చితంగా 125 రోజులు పని కల్పించ బోతు న్నామని, ఒకవేళ పని కల్పించక పోతే 15 రోజుల్లోనే వేతనం అందించా లని రూల్సో చేర్చామన్నారు. ఇంత మంచి స్కీంను విమర్శిం చడం బాధా కరమన్నారు.

## కరీంనగర్కు నిధుల వరద

కరీంనగర్లో రోడ్ల నిర్మాణ పనులను మరో వారం రోజుల్లో రూ.50 కోట్ల యూడీఎఫ్ నిధులతో ప్రారంభించబోతు న్నామని చెప్పారు. మరో 3 నెలల్లో అర్బన్ ఛాలెంజ్ స్కీం కింద కేంద్రం ఇచ్చిన రూ.840 కోట్ల నిధులతో కరీంనగర్ను సుందరంగా తీర్చిదిద్దే పనులను ప్రారంభించబో తున్నామన్నారు. కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అందించిన 100 రోజు ల్లోనే యూ డీఎఫ్ నిధులను తీసుకొచ్చామన్నారు, కరీంనగర్ లో పార్కింగ్ సమస్య లేకుండా రూ.25 కోట్లతో శాశ్వత పరిష్కార పనులకు శ్రీకారం చుట్టాచున్నారు. ఎంపీగా ఎన్నికైనప్పటి నుండి కరీంనగర్ పార్లమెంట్ నియో జకవర్గ అభివృద్ధి కోసం రూ.22 వేల కోట్లు తీసుకొ చ్చినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణం కోసమేరూ.10వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని, దసరా నాటికి కరీంనగర్ వరంగల్ హైవే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అతి త్వరలో కరీంనగర్ జగిత్యాల హైవే పనులను ప్రారంభిస్తామని, గన్నేరువరంబ్రిడ్జ్ నిర్మాణ పనులరు సైతం అతిత్వరలో శ్రీకారం చుట్టబో తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తానని తెలిపారు.

# రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

**ఈ జూలై నెలలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం**
**నల్లగొండ-మహబూబ్ నగర్ రోడ్డు పనుల్లో వేగం పెంచాలి**
**వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు**
**6న కరీంనగర్ జిల్లా హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన**
**హై కోర్టు భవనం,ఉస్మానియా ఆసుపత్రి డిసెంబర్ కల్లా పూర్తి కావాలి**
**టిమ్స్,నిమ్స్,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ పూర్తి చేయండి**
**ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ,కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలి**
**ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



**హైదరాబాద్,జూలై3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని,అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని,పనులు ప్రారంభించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసిన నాణ్యమైన ఆర్ అండ్ బి డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 'మంచి రోడ్డు – ప్రగతికి సూచిక' అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో పల్లె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి,గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బి లోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి,చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. మొదటి ఫేజ్ లో సుమారు 13వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా..ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు 155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని,అయినా.. వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్ లో ఉండే ఇంజనీర్లను ఎంపిక చేసి,ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని,పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజనీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని సి.ఈ లు బి.వి రావు,వసంత్ నాయక్ లను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. ఉాజేంద్ర నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హై కోర్టు భవనం,జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని,నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు వివరించగా....మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని,అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అట్లాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనుల్లో ఇంకా వేగం పెరగాలని,ఇది కూడా డిసెంబర్ 2027 వరకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధం అయిందని,అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టుల్లో టెక్నికల్ నాలెడ్జ్ ఉండి,మనసుపెట్టి పనిచేసే కమిట్మెంట్ ఉన్న ఇంజనీర్లను నియమించాలనీ మంత్రి సూచించారు. ఈ వారం నుండే నిర్మాణం జరుగుతున్న ప్రాంతాల్లో ఆకస్మిక సైట్ విజిట్స్ చేస్తానని..పనుల పురోగతిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తన దృష్టికి వస్తే, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోనని,కఠిన చర్యలు తప్పవని సున్నితంగా హెచ్చరించారు. బాసర,భద్రాచలం ఆలయ నిర్మాణ పనుల పురోగతి,గోదావరి పుష్కరాల కోసం ఆర్ అండ్ బి ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు..సంబంధిత ఆయా శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించుకొని పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఈఎన్సి జయ భారతి,అన్ని విభాగాల సి.ఈ లు.. బి.వి రావు,రాజేశ్వర్ రెడ్డి,ధర్మారెడ్డి, వసంత్ నాయక్,వనజ,రాజేందర్,నర్సింగ్ రావు పలువురు ఆర్ అండ్ బి ఇంజనీర్లు పాల్గొన్నారు.

# భూముల వేలంలో 50కోట్ల కుంభకోణం

## భద్రకాళి గుడి వద్ద బిఆర్ఎస్ నేతల హంగామా

**వరంగల్,జూలై3 :** వరంగల్ భద్రకాళి ఆలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ భూముల వేలంలో రూ.50 కోట్ల కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ నాయకుల ఆరోపించారు. దీనిపై ప్రస్తుత కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి భద్రకాళి గుడిలో ప్రమాణం చేయాలని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు. సవాల్ స్వీకరించిన మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, ఇతర బీఆర్ఎస్ నాయకులు తడిబట్టలతో ప్రమాణం చేసేందుకు ఆలయానికి వస్తుండగా వారిని పోలీసులు అరెస్ట్ చేయడం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. దీనిపై వెంటనే విచారణ చేయాలన్నారు.

# ఉస్మానియా వైద్యుల అరుదైన చికిత్స

## అవయవ మార్పిడిలో రికార్డు సృష్టి.. వైద్యులను సన్మానించిన మంత్రి దామోదర

**హైదరాబాద్,జూలై3 :** నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో వైద్యులను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్ర వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. దేశ వైద్య చరిత్రలోనే అత్యంత అరుదైన ఘనతను ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకుంది. అవయవదానం అనేది మహాదానం, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.' అని అన్నారు. ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రిలో తొలిసారిగా 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు అత్యంత విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు 36 గంటల పాటు ఎంతో క్లిష్టంగా సాగిన ఈ శస్త్రచికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్య బృందాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల ప్రతిభను, వారి అంకితభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అవయవదానం అనేది మహాదానమని, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం గట్టి సంకల్పంతో పనిచేస్తోందని మంత్రి దామోదర స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వైద్య రంగ బలోపేతానికి పెద్దపీట వేస్తూ గత రెండున్నరేళ్ల కాలంలోనే 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. అంతేకాకుండా, తాజాగా మరో 6,238 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలను నిరంతరం విస్తరిస్తున్నామని, ఉస్మానియా వైద్యుల ఘనతతో తెలంగాణ వైద్య రంగానికి జాతీయ స్థాయిలో గొప్ప గుర్తింపు లభించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు.

# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

**యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు**

**న్యూఢిల్లీ :** అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

## గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు

**వెలుగులోకి జైష్-ఎ-మహ్మద్ కుట్ర... మధ్యప్రదేశ్‌లో 8 మంది అరెస్ట్**

**గాంధీనగర్ :** గుజరాత్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్ ఏర్పాటు కోసం ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహ్మద్ చేసిన కుట్ర వెలుగులోకి వచ్చింది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్.. గుజరాత్, మధ్యప్రదేశ్‌లో 8 మందిని అరెస్ట్ చేసింది. గుజరాత్ ఏటీఎస్ అధికారులు గురువారం గుజరాత్‌లోని బనస్కాంత, పటాన్, నవ్‌సారితో పాటు పొరుగు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని దేవాస్ ప్రాంతంలో ఏకకాలంలో దాడులు నిర్వహించి ఈ 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అహ్మద్ గాజీవాలా, ఇబ్రహీం ఘూఘా, ముదస్సిర్ గాజీవాలా, జకారియా దురానీ, ముఫ్తీ ఫౌజాన్ దౌవా, మహ్మద్ అమీన్ పాలన్‌పురి, మహ్మద్ అబ్దుల్ సాఫ్దీ, బిలాల్ దురానీ ఘూఘాగా గుర్తించారు. వీరిలో ముగ్గురు సిద్ధ్‌పూర్, చిఖ్లీలోని మతపరమైన విద్యాసంస్థలతో సంబంధం ఉన్నట్లు తేలింది. నిందితులంతా జైష్-ఎ-మహ్మద్ సంస్థ తరఫున యాక్టివ్‌గా పనిచేస్తూ.. గుజరాత్ వ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి పని చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. అంతేకాదు.. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా రిక్రూట్‌మెంట్లు చేపట్టడానికి ఎ÷-లాన్ చేసినట్లు తేల్చారు. అధికారులు అరెస్టైన వారిపై ఉగ్రవాద నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేశారు. వారినుంచి డిజిటల్ పరికరాలు, ఇతర ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాద సంస్థతో దేశవ్యాప్త సంబంధాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## కుకీ దొంగలించాడంటూ.. ఉద్యోగి తొలగింపు

**అమెరికాలో ఫోర్డ్ కంపెనీ ఘరానా నిర్ణయం**

**తప్పని తేలడంతో ఉద్యోగంలో తిరిగి ఆహ్వానం**

**నమ్మకం లేనిచోట పనిచేయలేనన్న ఉద్యోగి**

**వాషింగ్టన్ :** చాక్లెట్ కుకీ దొంగలించాడనే ఆరోపణలపై ప్రముఖ వాహన తయారీ సంస్థ ఫోర్డ్ రూ.1.9 కోట్ల జీతం తీసుకునే ఓ ఉద్యోగిని తొలగించింది. ఈ ఘటన అమెరికాలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కెంటకీలోని లూయిస్‌విల్లేలో ఉన్న ఫోర్డ్ ట్రక్ ఫ్యాక్టరీలో.. 60ఏళ్ల కర్ట్ క్రోమ్ 11 ఏళ్లుగా పని చేస్తున్నాడు. ఎంతో విధేయతగా సగటున వారానికి 60 గంటలు పనిచేసేవాడినని.. అయినప్పటికీ తప్పుడు ఆరోపణలతో తనను ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను కంపెనీలో రూ. 1.9 కోట్లు సంపాదిస్తున్నానని.. గతేడాది ఆఫీస్ క్యాంటీన్‌లో సుమారు రూ. 1.14 లక్షలు ఖర్చు చేశానని తెలిపాడు. ఇటీవల కంపెనీలో ఉన్న సమయంలో షుగర్ లెవల్స్ పడిపోతున్నట్లు అనిపించడంతో ఓ చాక్లెట్ కుకీ కుకీని కొనుగోలు చేశానని పేర్కొన్నాడు. కొద్ది రోజుల అనంతరం సూపర్‌వైజర్ తనను పిలిచి ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు చెప్పాడని.. కారణమేంటని అడగ్గా కుకీని దొంగలించినందుకు జాబ్ నుంచి తీసేస్తున్నట్లు పేర్కొన్నాడని వెల్లడించాడు. తాను కుకీని దొంగలించలేదని.. దానిని కొనుగోలు చేసినట్లు తన వద్ద బిల్లు ఉందని చెప్పినప్పటికీబలవంతంగా ఫ్యాక్టరీ ప్రాంగణం నుంచి బయటకు పంపేశారని ఆరోపించాడు. ఆ బిల్లు స్క్రీన్‌షాట్ పంపించిన అనంతరం తాను నిర్దోషిగా తేలడంతో ఉద్యోగానికి తిరిగి రావాలని యూనియన్ ప్రతినిధి పిలిచారని బాధితుడు వెల్లడించాడు. కానీ తనను అవమానించిన చోట పని చేయకూడదని నిర్ణయించుకున్నట్లు అతడు వెల్లడించాడు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఉద్యోగి పట్ల ఫోర్డ్ అధికారుల తీరును నెటిజన్లు విమర్శిస్తున్నారు.

## విదేశీ పేరున్నంత మాత్రాన హిందువు కాదంటే ఎలా

**మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు**

**చెన్నై:** మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. విదేశీ పేరు, పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందూ గుర్తింపును నిరాకరించలేమని తేల్చి చెప్పింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ఎలాంటి సర్టిఫికెట్లు, ప్రత్యేక వేడుకలు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది. లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనఃస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని మద్రాస్ హైకోర్టు హుకుం జారీ చేసింది.

# పశ్చిమాసియా సంక్షోభంలో రహస్యాలు

**ఇరాన్ నేతలను మట్టుపెట్టాలనుకున్న ఇజ్రాయిల్**

**అమెరికా రంగంలోకి దిగడంతో తప్పిన ముప్పు**

**న్యూయార్క్ టైమ్ కథనం వెల్లడి**



**వాషింగ్టన్ :** పశ్చిమాసియా సంక్షోభంలో సరికొత్త అంతర్జాతీయ రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి.. అమెరికా, ఇజ్రాయెల్ మైత్రి బీటలు వారిందని చెప్పేందుకు మరింత ఊతమిచ్చేలా ఉన్నాయి. ఇరాన్ అగ్రనేతలు, శాంతి చర్చల ప్రతినిధులైన విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఖ్చి, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ గాలిబాఫ్ లపై ఇజ్రాయెల్ వేసిన 'హత్య ప్రణాళిక' ను అమెరికా ముందే పసిగట్టి, ఇరాన్‌ను అప్రమత్తం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్'ఈ రక్షణ రహస్యాలను బహిర్గతం చేసింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హతమార్చిన తర్వాత, ఇరాన్ ఉన్నత స్థాయి నాయకత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ఇజ్రాయెల్ వ్యూహం రచించింది. అయి-ంతే, ఏప్రిల్ 8న జరిగిన మొదటి తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత అమెరికాతో అణు, శాంతి చర్చలు జరపడానికి ఇరాన్ తరఫున అరాఖ్చి, గాలిబాఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇది ఇజ్రాయెల్‌కు ససేమిరా ఇష్టం లేదు.

న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 12న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌తో చర్చలు ముగించుకుని తిరిగి ఇరాన్‌కు విమానంలో ప్రయాణమయ్యారు. గాలిబాఫ్ ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేయడానికి ఇజ్రాయెల్‌కు చెందిన రెండు ఫైటర్ జెట్స్ ఇరాక్ మీదుగా ఇరాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించాయి. ఈ నిఘా సమాచారాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ ముందే గుర్తించి, ప్రాంతీయ దేశాల (పాకిస్థాన్, ఖతార్) మధ్యవర్తుల ద్వారా ఇరాన్ ప్రభుత్వాని కి అత్యవసర హెచ్చరికలు పంపింది. సమాచారం అందిన వెంటనే ఇరాన్ రక్షణ దళాలు గాలిబాఫ్ విమానాన్ని టెహ్రాన్‌కు వెళ్లకుండా దారి మళ్లించి, ఈశాన్య ప్రాంతంలోని 'మషద్' నగరంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించాయి. ఆ తర్వాత గాలిబాఫ్ రోడ్డు మార్గంలో సురక్షితంగా టెహ్రాన్ చేరుకున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చలు జరుపుతున్న సమయంలో ఆ దేశ ప్రధాన దౌత్య వేత్తలను ఇజ్రాయెల్ హతమరిస్తే, చర్చలు పూర్తిగా దారి తప్పి, అమెరికా కూడా నేరుగా ఇరాన్‌తో పెద్ద ఎత్తున యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని వాషింగ్టన్ భయప డింది. 'వారినీ చంపేస్తే ఇక మనం శాంతి చర్చలు జరప టానికి ఇరాన్‌లో ఒక్క నేత కూడా మిగలడు' అని పాకిస్థాన్ దౌత్యవేత్తలు కూడా అమెరికాకు స్పష్టం చేశారు. దీంతో అమెరికా స్వయంగా రంగంలోకి దిగి ఇజ్రాయెల్‌ను వెనక్కి తగ్గాలని ఆదేశించిందని కూడా సదరు నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉంటే, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2025లో జరిగిన 12 రోజుల యుద్ధంలో, అలాగే ఈ ఏడాది జరిగిన ఘర్షణల్లో ఇరాన్ భూగర్భ బంకర్లపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల శిథిలాల నుంచి గాలిబాఫ్ రెండుసార్లు ప్రాణాలతో బయటపడ్డారు.ఇక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు మధ్య ఇటీవల కాలంలో తీవ్రమైన విభేదాలు రావడానికి ఈ ఘటనే పునాది అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేకాదు, ఇజ్రాయెల్‌కు ఇష్టం లేకపోయినప్పటికీ, అమెరికా.. ఇరాన్‌తో విడిగా చర్చలు జరిపి 14 అంశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## నేడు అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం

**జూలై4న 13 రాష్ట్రాల సమాహారంగా అమెరికా ఏర్పాటు**

**వాషింగ్టన్ :** అగ్రరాజ్యం అమెరికా జూలై4న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటోంది.

అమెరికాకు 1776లో స్వాతంత్ర్యం లభించింది. మరి అంతకుముందు అది ఒకే దేశంగా ఉండేది కాదు! బ్రిటిష్ పాలనలోని 13 వలస రాజ్యాల సమాహారంగా ఉన్న ప్రాంతం తదుపరి ప్రత్యేక దేశంగా, అమెరికాగా అవతరించింది. 'ప్రాతినిధ్యం లేనిదే పన్ను లేదు' అనే నినాదంతో ఈ రాజ్యాలన్నీ బ్రిటిష్ పాలనకు ఎదురు తిరిగాయి. చివరకు 1776 జులై 4న పదమూడు వలస రాజ్యాలు స్వాతంత్ర్యం ప్రకటించుకొని.. అన్నీ కలిసి అమెరికాగా అవతరించాయి. అమెరికాలో ప్రస్తుతమున్న రాష్ట్రాల సంఖ్య 50. కానీ స్వాతంత్ర్యం వచ్చేనాటికి అట్లాంటిక్ తీరంలోని 13 రాష్ట్రాలు మాత్రమే అందులో భాగంగా ఉండేవి. అనేక కొనుగోళ్లు, యుద్ధాలు, ఒప్పందాలతో మిగతా రాష్ట్రాలను వాషింగ్టన్ దక్కించుకుంది. 1803లో ఫ్రాన్స్ నుంచి లూసియానాను కొనుగోలు చేసింది. దాంతో దేశ భూభాగం దాదాపు రెట్టింపైంది. 1819లో స్పెయిన్ నుంచి ఫ్లోరిడా దక్కింది. టెక్సాస్ తొలుత స్వతంత్ర దేశంగా ఏర్పడి.. 1845లో అమెరికాలో విలీనమైంది. మెక్సికోతో యుద్ధం తర్వాత అమెరికాలో కాలిఫోర్నియా, ఆరిజోనా, నెవాడా, ఉటా చేరాయి. 1867లో రష్యా నుంచి అలాస్కాను కొనుగోలు చేశారు. 1959లో హవాయి 50వ రాష్ట్రంగా మారింది. భౌగోళిక విస్తరణే అమెరికా ఆర్థిక, సైనిక శక్తికి పునాది అయింది. దేశానికి విస్తారమైన వ్యవసాయ భూములు, ఖనిజ సంపదతో పాటు రెండు మహాసముద్రాలపై ఆధిపత్యాన్ని కట్టబెట్టింది. అమెరికా 1861-65 మధ్య అంతర్యుద్ధంతో అతలాకుతలమైంది. బానిసత్వమే అందుకు ప్రధాన కారణం. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయం ఆఫ్రికన్ బానిసల శ్రమపై ఆధారపడగా.. ఉత్తర రాష్ట్రాలు పారిశ్రామికీకరణ వైపు వెళ్లి బానిసత్వాన్ని వ్యతిరేకించాయి. ఈ విభేదాలు దేశాన్ని రెండు శిబిరాలుగా చీల్చాయి. అబ్రహాం లింకన్ అధ్యక్షుడిగా ఎన్నికవడంతో 11 దక్షిణ రాష్ట్రాల విడిపోయి ప్రత్యేక సమాఖ్యను ఏర్పాటుచేశాయి. అంతర్యుద్ధంలో ఆరు లక్షల మందికిపైగా మరణించారు. 1863లో లింకన్ బానిసల విముక్తి ప్రకటన జారీ చేయడంతో అంతర్యుద్ధం.. స్వేచ్ఛ కోసం పోరాటంగా మారింది. ఉత్తర రాష్ట్రాల విజయంతో బానిసత్వం రద్దయింది. అయితే జాతి వివక్ష వెంటనే అంతరించిపోలేదు. సమాన హక్కుల కోసం నల్లజాతీయులు మరో శతాబ్దం పాటు పోరాడాల్సి వచ్చింది. అయినప్పటికీ అంతర్యుద్ధమే అమెరికాను శాశ్వతంగా ఏకీకృత దేశంగా నిలబెట్టిందని చెప్పొచ్చు. అందుకే చరిత్రకారులు దీనిని అమెరికా రెండో జననంగా పిలుస్తారు. ఇలా దేశం విస్తరించడానికి అప్పటి నాయకుల కృషి ఎనలేనిది. ఇప్పుడు ట్రంప్ కూడా రాజ్య విస్తరణ కాంక్షను వదులుకోవడం లేదు.

## పాకిస్థాన్‌లో లోయలో పడ్డ బస్సు

**40మంది ప్రయాణికుల దుర్మరణం**

**ఇస్లామాబాద్ :** పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# అయోధ్య చోరీపై ఆర్ఎస్ఎస్ ఆందోళన

**దోషులను కఠినంగా శిక్షించాల్సిందే**

**హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని వదలరాదు**

**ఈ ఘటనతో హిందూ వ్యతిరేక శక్తులకు అవకాశం ఇవ్వరాదు**

**విచారం వ్యక్తం చేసిన ఆర్ఎస్ఎస్ ప్రతినిధి దత్తాత్రేయ హోసబలే**



**న్యూఢిల్లీ :** అయోధ్య రామ మందిర విరాళాల చోరీ ఘటనపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎసెస్ ఆందోళన వ్యక్తం చేసింది. రాముడి విరాళాలను దొంగిలించడం తమను తీవ్రంగా బాధిస్తోందని ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే విచారం వ్యక్తం చేశారు. తరతరాలుగా భక్తుల త్యాగాలు, అంకితభావం కారణంగా శ్రీరామ జన్మభూమిలోని ఈ భారీ ఆలయం రూపుదిద్దు కుందన్నారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఒక ప్రత్యేకమైన అంశంగా పరిగణించి, ఆలయ నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దాలని హోసబలే శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌ను కోరారు. ఈ కేసులో దర్యాప్తు జరుగుతున్నందున నిందితులకు శిక్షపడే వరకు సంయమనం పాటించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనను అవకాశంగా తీసుకొని కొందరు వ్యక్తులు హిందూ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు నేపథ్యంలో రాజీనామా చేసిన అయోధ్య ఆలయ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రాలకు శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ షో-కాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయ అధికారుల మధ్య జులై 6న జరగనున్న కీలక సమావేశంలో ఈ చర్యలు తీసుకునే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విరాళాల అవకతవకలకు సంబంధించి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని వారిని కోరనున్నట్లు తెలిపాయి. దర్యాప్తు అనంతరం వారిపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రామ్ మందిర్ విరాళాల వివాదంపై ఆర్ఎస్ఎస్ శుక్రవారం స్పందించింది. అయోధ్య హుండీల నుంచి డబ్బులు దొంగతనం చేయటంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన ఎంతో బాధ కలిగించిందని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జనరల్ సెక్రటరీ దత్తాత్రేయ హాళసబలే న్యూఢిల్లీ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో.. దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఆలయ నిర్వహణలో లోపాలను సరిదిద్దాలని కోరారు. దేశ వ్యతిరేక శక్తుల కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ఘటన కోట్లాది మంది రామభక్తుల నమ్మకాన్ని, హిందూ సమాజం సెంటిమెంట్లను తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటన కారణంగా మేము తీవ్ర ఆవేదనకు, ఆగ్రహానికి గురయ్యాం. ఈ దురదృష్టకర సంఘటనను హిందూ వ్యతిరేక, దేశ వ్యతిరేక శక్తులు తమ స్వార్థం కోసం వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. హిందూ సమాజంపై, సనాతన ధర్మంపై బురద జల్లడానికి ఈ వివాదాన్ని ఒక అస్త్రంగా మలచుకునే కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఈ కష్టసమయంలో హిందూ సమాజమంతా ఎంతో ఓపికను, నిగ్రహాన్ని ప్రదర్శించాలి. ఎలాంటి తప్పుడు ప్రచారాలకు లోనుకాకుండా.. శత్రువుల కుట్రలను తిప్పికొట్టడానికి అందరూ ఐక్యమత్యంగా ఉండాలి. రామమందిరం ఎన్నో తరాల పోరాటాలు, కోట్లాది మంది త్యాగాల ఫలితంగా నిర్మితమైంది. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు జరగకుండా ఆలయ ట్రస్ట్ పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందన్న నమ్మకం నాకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వరుణుడి కరుణ కోసం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



**సత్తుపల్లి:** పెనుబల్లి మండలంలోని సూరయ్య బంజరతండాలో సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ గ్రామస్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లిస్తూ బొడ్డురాయికి జలాభిషేకం చేసి, మైసమ్మ తల్లికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు నిండి పంటలు పుష్కలంగా పండాలని ప్రార్థించారు. గ్రామ ప్రజలంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. వర్షాభావ పరిస్థితులు తొలగి వ్యవసాయ పనులు ఊపందుకోవాలని, రైతుల కష్టాలు గట్టెక్కాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. గ్రామీణ సాంప్రదాయాలను అనుసరిస్తూ నిర్వహించిన ఈ ప్రత్యేక పూజల్లో తండా ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం





**ఆదిలాబాద్:** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని 31వ వార్డులో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూషతో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం అదే వార్డులో నిరుపేద కుటుంబాలకు చెందిన నాసియా, సమీనా పర్వీన్లకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తోందని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి రోహిత్, 31వ వార్డు కౌన్సిలర్ రషీదుల్ హక్, 33వ వార్డు కౌన్సిలర్ మెహబూబ్, 2వ వార్డు కౌన్సిలర్ నియామత్, కాంగ్రెస్ నాయకులు రఫీ, అల్మాస్, రజాక్, అజ్జు, దస్తగిరి, మోసిన్, సుభాష్, ఖమర్, అలీం, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు సోకే వ్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**నేరడిగొండ:** పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ రూపావత్ వెంకటరాం అన్నారు. ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఉచిత 'ముద్ద చర్మ వ్యాధి' నివారణకు పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ మాట్లాడుతూ ప్రభుత్వం పశువులకు సోకే ప్రమాదకరమైన 'ముద్ద చర్మ వ్యాధి' (లంపీ స్కిన్) నివారణకు ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు తమ పశువులకు రక్షణ కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు. గ్రామంలోని పాడి రైతులందరు తమ ఆవులను, ఎద్దులను తప్పనిసరిగా టీకా కేంద్రానికి తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు

# ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

- **సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరీ చిరంజీవి**



**ఆసిఫాబాద్ టౌన్:** వానాకాలం సాగు సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సరిపడా యూరియా బస్తాలు సరఫరా చేయాలని, అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆసిఫాబాద్ మండల సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం ఆసిఫాబాద్ మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎ. చిరంజీవికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరీ చిరంజీవి మాట్లాడుతూ ప్రస్తుతం పంటల సాగు అత్యంత కీలక దశకు చేరుకుందని, అయితే కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతతో పాటు ఆన్ లైన్ యాప్ బుకింగ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో రైతులు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ప్రైవేట్ ఎరువుల దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ రేట్లకు యూరియా విక్రయిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, యూరియా బస్తాలతో పాటు రైతులకు అవసరం లేని ఇతర ఉత్పత్తులను కూడా బలవంతంగా అంటగడుతూ ఆర్థికంగా నష్టపరుస్తున్నారని మండిపడ్డారు.రైతులకు సకాలంలో ఎరువులు అందకపోతే పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో తక్షణమే ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువకు అమ్మే వ్యాపారులపై ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దుకాణంలో ధరల జాబితా, నిల్వల వివరాలు, ఫిర్యాదుల నంబర్లను స్పష్టంగా ప్రదర్శించేలా చూడాలని, ఆన్ లైన్ బుకింగ్ సమస్యలను పరిష్కరించి రైతులకు సులభంగా యూరియా అందేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు పిడుగు శంకర్, తాళ్లపల్లి దివాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలి

**డీవైఎఫ్ఐ డిమాండ్**

**కాగజ్ నగర్ :** ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ మండల విద్యాధికారి వసాల ప్రభాకర్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు గోడిసెల కార్తీక్, గేడం టికనంద్ మాట్లాడుతూ మండలంలోని శ్రీ చైతన్య, అరుణోదయ, శాంతినికేతన్, విఐపి, విశ్వశాంతి, ఫాతిమా కాన్వెంట్, సెంట్ క్లారిట్ వంటి పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. పేరెంట్స్ కమిటీలు వేయకుండా, ఫీజుల పట్టికలు పెట్టకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా స్కూళ్లలోనే విచ్చలవిడిగా బుక్స్, యూనిఫాం, షూ, బెల్టులు అమ్ముతూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రైవేట్ పాఠశాలలపై పూర్తి విచారణ జరిపి, ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని మరియు స్కూళ్లలో వ్యాపారాలు సాగకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



# కన్నెపల్లి ఉప సర్పంచ్ భర్త దినేష్ మృతి

- **భౌతికకాయానికి నివాళులర్పించిన రాష్ట్ర, జిల్లా ఉప సర్పంచుల సంఘం నాయకులు**



**తిర్యాని :** తిర్యాని మండలం కన్నెపల్లి గ్రామ ఉప సర్పంచ్ కవిత భర్త దినేష్ చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు అకాల మరణం చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచుల సంఘం నాయకులు కన్నెపల్లి గ్రామానికి చేరుకుని దినేష్ భౌతికకాయానికి ఘన నివాళులర్పించారు. ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ , ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు దీపక్ ముండే పాల్గొని దినేష్ పార్థివ దేహంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఉప సర్పంచ్ కవితని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల కార్తీక్ మాట్లాడుతూ కవిత కుటుంబానికి రాష్ట్రంలో ఉన్న ఉప సర్పంచులు అందరూ ఎల్లప్పుడూ అండగా ఉంటారని, అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దుద్యాల రాజిరెడ్డి , పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ జంగ అనిల్ , వార్డు సభ్యుల జిల్లా ఇన్చార్జ్ జావిద్ , తిర్యాని మండల ఇన్చార్జ్ చెని కుమార్ , వివిధ గ్రామాల ఉప సర్పంచులు ముక్కెర సరిత (గోయెగాం), గడ్డి హరిత అశోక్ (సుంగపూర్), సెడ్మాకి మోహన్ (కైరీగూడ), సోయం కట్టి (గడలపల్లి), తిరుపతి (మాణిక్య పూర్), కనక శ్రీకాంత్ (మంగి), మడావి నాందేవ్ (చింతపల్లి), ఆత్రం భీము (దేవాయిగూడా), బోర్ కుంట యువరాజ్ (ఉల్లి పిట్ట), పెందూర్ వనిత దయాకర్ (రోంపల్లి), కుడ్మెత రవీందర్ (మెస్రం గూడా), సంతోష్ (బాంబర), విజయ్ (కోమటిగూడ) తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక యంత్రాలతో పనుల నిర్వహణ వేగవంతం

- **12 టన్నుల సామర్థ్యంతో నూతన ఎస్కార్ట్ క్రేన్ ప్రారంభించిన జీఎం**

**సత్తుపల్లి:** ఆధునిక యంత్రాల వినియోగంతో పనుల నిర్వహణ మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగడంతో పాటు భద్రతా ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ చింతల శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి సింగరేణి ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీ లైట్ మోటార్ వెహికల్ (ఎల్ ఎంవి) సెక్షన్లో సుమారు రూ.22.69 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 12 టన్నుల సామర్థ్యం గల నూతన ఎస్కార్ట్ క్రేన్ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన క్రేన్ అందుబాటులోకి రావడంతో వాహనాల మరమ్మతులు, భారీ యంత్రాల నిర్వహణ పనులు మరింత సులభతరం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ ఎన్వీఆర్ ప్రహ్లాద్, ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ కె.సోమశేఖర్ రావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, ఎస్ఓఎం బి.రాజేశ్వరరావు, మేనేజర్ (ఆపరేషన్స్) జి.కళ్యాణ్ రామ్, సేఫ్టీ ఆఫీసర్ ఎస్.గోవింద్, ఎస్ఈ ముక్కా శ్రీను, డివిజనల్ ఇంజనీర్ పి.గోపి, కాలరీ ఇంజనీర్ జగదీశ్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.సుధాకర్, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు, సంక్షేమ అధికారులు దారా కావ్య, కె.శ్రీనివాస్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి

**నేరడిగొండ:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని నేరడిగొండ గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారు తమ పేరు, చిరునామా తదితర వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేయాల్సిన వారు, పేర్లు తొలగిపోయిన వారు సంబంధిత బీఎల్ఓ, బీఎల్ఏలను సంప్రదించి నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఈ ప్రక్రియలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, సందేహాలు ఉంటే సంబంధిత అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త సాబ్లే సంతోష్ సింగ్, నాయకులు షేక్ బాబా, మాజీ వార్డు సభ్యుడు రాథోడ్ రాజశేఖర్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# బెజ్జాల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**తాండూర్:** మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బెజ్జాల గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు నర్సాపూర్ గ్రామ సర్పంచ్ ప్రభాత్ రావు, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గంగుపటేల్ గూడెంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద రూ.5 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ రహదారి పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఉప సర్పంచ్ పర్వత్ రావు, మాదారం, రాజీవ్నగర్ ఉప సర్పంచులు సూరం దామోదర్ రెడ్డి, కాపర్తి సుభాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భగవంతరావు, లచ్చు పటేల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చురకలు



# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్
- 15వేల మందితో సత్తుపల్లిలో భారీ వనమహోత్సవ ర్యాలీ




**సత్తుపల్లి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో శుక్రవారం సుమారు 15వేల మందితో రాష్ట్రంలోనే తొలిసారిగా భారీ వనమహోత్సవ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొన్న ఈ కార్యక్రమం రాష్ట్ర చరిత్రలోనే విశిష్ట ఘట్టంగా నిలిచింది. జేవీఆర్ కళాశాల మైదానంలో ప్రారంభమైన కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ మీదుగా సాగిన భారీ ర్యాలీలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జానపద కళాకారుల ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, మట్టా దయానంద్ చిన్నారులతో కలిసి ర్యాలీలో పాల్గొని వారిలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్న కార్యక్రమానికి తాను హాజరు కావడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. సమాజంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని అన్నారు. భారీ స్థాయిలో నిర్వహించిన ఈ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును సంపాదించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, డీఎఫ్వో, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రమాదాల బాటలో ప్రయాణం

- గుంతలమయంగా మారిన కెరమెరి మెయిన్ రోడ్డు

**కెరమెరి:** కెరమెరి మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రహదారిపై భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తుండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ పరిస్థితిపై అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. రహదారిపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండటంతో రోడ్డు ఎక్కడ ఉందో, గుంత ఎక్కడ ఉందో గుర్తించడం కష్టంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ఈ గుంతల్లో పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు స్వల్ప గాయాలతో బయటపడగా, ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, మార్కెట్కు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఈ రహదారిని ఉపయోగిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను తరలించే రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర సేవల కోసం వచ్చే అంబులెన్స్లు సైతం ఈ రహదారిపై నెమ్మదిగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం ప్రారంభం కావడంతో రహదారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ శాశ్వత



పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చి వాహనదారులకు ఉపశమనం కల్పించాలని, అలాగే నీరు నిల్వ కాకుండా డ్రైనేజీ సౌకర్యాలు ఏర్పాటు చేసి శాశ్వత ప్రాతిపదికన నాణ్యమైన రహదారిని నిర్మించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్:** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతో పాటు వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వంటి వెక్టర్ జనిత వ్యాధుల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా టాస్క్ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ వెక్టర్ జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, భవిష్యత్తు కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా వెక్టర్ జనిత వ్యాధులపై




ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీ, వార్డు కార్యాలయంలో టోల్ఫ్రీ నం. 9491103108ను ప్రదర్శించాలని తెలిపారు. పట్టణ ప్రాంతాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, జవాన్లు, శానిటేషన్ సిబ్బంది, పీడీఎంఏ సిబ్బంది సహకారంతో హాట్స్పాట్లను గుర్తించి ముందుగా ఫీవర్ సర్వే, అనంతరం అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే' కార్యక్రమాలను నిర్వహించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వినియోగం చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలల్లో నీరు నిల్వ కాకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలలను పీహెచ్సీ వైద్యాధికారులు తరచూ సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వంటశాలలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించడంతో పాటు అక్కడ భోజనం చేసి నాణ్యతను నిర్ధారించాలని స్పష్టం చేశారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ఈనెల 13న ప్రారంభమై 20 వరకు మాప్-అప్ కార్యక్రమంతో కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు అర మాత్రను ఇవ్వాలని, రెండు నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పూర్తి మాత్ర అందించాలని సూచించారు. మాత్రల పంపిణీ క్లాస్ టీచర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తల ప్రత్యక్ష పర్యవేక్షణలో సురక్షితంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఎంహెచ్ఓ సాధన, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, డీఈఓ మాధవి, ప్రోగ్రాం అధికారి సుమలత, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, నీటి సరఫరా, సంక్షేమ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల:** జిల్లాలో రైస్ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. శుక్రవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు, టాస్క్ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసిందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా



కేటాయించి సీఎంఆర్ లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. రైస్ మిల్లర్లు అధికారులతో సమన్వయం చేసుకుని లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్లో ఉన్న చెల్లింపులను త్వరగా పూర్తి చేయడంతో పాటు, డీలర్లకు కేటాయించిన మేరకు బియ్యం సరఫరాను వేగవంతం చేయాలని ఆదేశించారు. డిఫాల్టర్లుగా ఉన్న



మిల్లర్లు తమ బకాయిల్లో కనీసం 70 శాతం మొత్తాన్ని వెంటనే చెల్లించాలని, ఆగస్టు 31వ తేదీలోపు సీఎంఆర్ డెలివరీ పూర్తి చేసేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్లో రూ.1.79 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- తొమ్మిది వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమిపూజ

**ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పట్టణ సమగ్రాభివృద్ధిలో భాగంగా రూ.1.79 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులకు శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ యూఐడీఎఫ్ పథకం కింద ఇప్పటికే ఆదిలాబాద్ పట్టణంలో రూ.18.70 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో సుమారు రూ.150 కోట్ల విలువైన మరిన్ని అభివృద్ధి పనులను పట్టణానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తూ అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రోహిత్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, కాలనీ



వాసులు పాల్గొన్నారు.

# కిసాన్ క్రాంతి పథకంతో రైతులకు చేయూత

## వంద శాతం రాయితీపై పత్తి విత్తనాల పంపిణీ




**గుడిహత్నూర్:** కిసాన్ క్రాంతి పథకంతో ప్రభుత్వం రైతులకు చేయూతనిస్తుందని మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్ అన్నారు. కిసాన్ క్రాంతి పథకం కింద ఎంపికైన రైతులకు శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వంద శాతం రాయితీపై పత్తి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలా మంది రైతులు ఎకరానికి తక్కువ మొక్కల సాంద్రతతో పత్తి సాగు చేయడం ద్వారా దిగుబడి తగ్గడంతో పాటు సాగు ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. రైతులు అధిక సాంద్రత పద్ధతిలో స్వల్పకాలిక పత్తి రకాలను సాగు చేయడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే ఉత్పాదకత పెరిగి రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం క్లస్టర్ పరిధిలోని పత్తి రైతులకు ఉచితంగా పత్తి విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రమ్య, దీపక్, సాయిరాం, జ్యోతి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు




**తాండూర్:** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం ప్రదర్శించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తాండూర్ ఎంపీఓ జి.అనిల్ కుమార్ సూచించారు. శుక్రవారం తాండూర్ మండలం రేచిని గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నాలుగు రకాల చెత్త డబ్బాల వినియోగంపై అవగాహన కల్పించాలని, గ్రామంలో ఎక్కడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తడి చెత్తతో కంపోస్ట్ ఎరువును తయారు చేసి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రేచిని గ్రామ సర్పంచ్ పోతురాజుల రాంబాయి, ఉప సర్పంచ్ కొడిపాక భీమయ్య, పశువైద్యాధికారి శివప్రసాద్, ఆర్ఐ మురళీధర్ రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ ఆపరేటర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఆరోగ్య పాఠశాల' పుస్తకావిష్కరణ



**ఆదిలాబాద్:**
ఆదిలాబాద్ పట్టణంలోని రణదివేనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు రూపొందించిన 'ఆరోగ్య పాఠశాల' పుస్తకాన్ని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, వ్యక్తిత్వ వికాసం, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో 1 నుంచి 10వ తరగతి విద్యార్థుల కోసం ఈ పుస్తకాన్ని రూపొందించారు. పరిశుభ్రత, పోషకాహారం, సహజ ఆరోగ్యం, మాదకద్రవ్యాల నివారణ, సీజనల్ వ్యాధుల నివారణ, స్ఫూర్తిదాయక జీవితాలు వంటి అంశాలను వారంలో ఒక్కో రోజుకు ప్రత్యేకంగా ఇందులో పొందుపర్చారు. ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక 'స్కాచ్ అవార్డు' లభించడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాలలో రూ.8.50 లక్షల వ్యయంతో నిర్మించిన ఆదర్శ మరుగుదొడ్లను మున్సిపల్ చైర్పర్సన్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోనే ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని అమలు చేయడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని రూపుదిద్దిన జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు. విద్యార్థులు 'ఆరోగ్య పాఠశాల' పుస్తకాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, టీపీఓ సుమలత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కౌన్సిలర్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం



**ఇచ్చోడ:** కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదలు, రైతులు, కార్మికులు, యువత, మహిళల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఇచ్చోడ మండలంలోని మాల్యల్ గ్రామంలో గ్రామస్తుల కోరిక మేరకు స్థానిక సర్పంచ్ మెస్రం దేవురావుతో కలిసి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ గురించి అధికారులు, స్థానికుల ద్వారా అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా గద్దెలను ఏర్పాటు చేసి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించి ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. అంతకుముందు మాల్యల్ గ్రామానికి చేరుకున్న ఆడే గజేందర్కు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందించాలని కోరుతూ గ్రామస్తులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు..

# ఘనంగా రైతు భరోసా సంబరాలు

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**భీంపూర్:** తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లో రూ.9 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా భీంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రైతు భరోసా సంబరాలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచి, బాణసంచా కాలుస్తూ ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతు భరోసా నిధులను సకాలంలో విడుదల చేసి రైతులకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని అభినందించారు. రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్ఓలకు అందజేయాలి

## తహశీల్దార్ అడా బిర్ షావ్



**జైనూర్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసిన వెంటనే సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లకు (బీఎల్ఓ)లకు అందజేయాలని జైనూర్ తహశీల్దార్ అడా బిర్ షావ్ సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ప్రతి ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా పూర్తి చేసి, ఎలాంటి ఆలస్యం లేకుండా సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని కోరారు. సమయానికి ఫారాలు సమర్పించడం ద్వారా ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా పూర్తవుతుందని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడానికి ఈ ప్రక్రియ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించి, ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా పూర్తి చేసి సమర్పించాలని కోరారు.

# రాజు గోండుల కోటాను దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్:** గిరిజనుల చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఉట్నూర్ రాజు గోండుల కోటాను పునరుద్ధరించి దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని చారిత్రక రాజు గోండుల కోటాను ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందుతో కలిసి శుక్రవారం సందర్శించారు. కోటా పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం ఐటిడీఏ పీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గోండు రాజుల చరిత్ర, గిరిజన సంస్కృతికి ప్రతీకగా నిలిచిన ఈ కోటా చారిత్రకతకు ఎలాంటి భంగం కలగకుండా పునర్ నిర్మించాలని సూచించారు. ఆధునిక సౌకర్యాలతో దేశ నలుమూలల నుంచి పర్యాటకులను ఆకర్షించేలా సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. భావితరాలకు గిరిజనుల గొప్ప చరిత్రను పరిచయం చేసే విధంగా కోటాలో అత్యాధునిక మ్యూజియం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో గోండు రాజుల వంశ చరిత్ర, పాలనా విధానం, సంస్కృతి, సాంప్రదాయాలు, వారసత్వ ఆనవాళ్లు, పురాతన వస్తువులు, చారిత్రక ఆధారాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అదేవిధంగా కోటా ప్రాంగణంలో గిరిజన సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదిక, గిరిజన హస్తకళలు, సాంప్రదాయ ఉత్పత్తుల విక్రయానికి మార్కెటింగ్ స్టాల్స్, చిన్నారుల కోసం పార్కు, క్రీడా ప్రాంగణం, సందర్శకుల కోసం విశ్రాంతి భవనాలు, రూఫింగ్ షెడ్లు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఆకర్షణీయమైన ఉద్యాన వనాలు, విద్యుద్దీపాల అలంకరణ, పచ్చదనం పెంపు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. సందర్శకులు కోటా చరిత్రను సులభంగా తెలుసుకునేలా సమాచార ఫలకాలు, దిశానిర్దేశక బోర్డులు, డిజిటల్ సమాచార వ్యవస్థలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కోటా అభివృద్ధి ద్వారా స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఉట్నూర్ ప్రాంతం పర్యాటక రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు మాట్లాడుతూ రాజు గోండుల కోటాను సుందరీకరించి జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున్ రావు, అదనపు డైరెక్టర్ నరసింహులు, డీడీ సాగర్, ఓఎస్డీ రాజు, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తానాజీ, ఏపీఓ పీటీజీ ఆత్రం భాస్కర్, డిప్యూటీ డీఈఓ చందన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# భూ సర్వేతో రెవెన్యూ గ్రామాల హద్దులు స్పష్టం





- భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల:** జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, రెవెన్యూ గ్రామాల హద్దులను ఖరారు చేయడం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో నిర్వహించిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు మండల తహశీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ మోహన్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు. ముందుగా ప్రతి గ్రామానికి సంబంధించిన భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించడం ద్వారా ప్రభుత్వ భూములు, పట్టా భూములపై స్పష్టత వస్తుందని అన్నారు. పట్టా ఉండి మోకాలో లేని భూములు, మోకాలో ఉండి పట్టా లేని భూముల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. భూ సర్వేలో ఆధునిక మ్యాపింగ్ విధానాన్ని వినియోగించడం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలను నివారించవచ్చని, అవసరమైతే న్యాయపరమైన పరిష్కారాలకు కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియలో సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండలంలోని కేజీబీవీని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించడంతో పాటు నాణ్యమైన విద్య బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తదుపరి కోటపల్లి మండల కేంద్రంలో అమృత్ 2.0 పథకం కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కేజీబీవీ, తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. వివిధ ధ్రువపత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ముమ్మరంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

**సిరికొండ:** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బోథ్ నియోజకవర్గంలోని సిరికొండ మండలంలో ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం సిరికొండ మండలంలోని సుంకిడి, కోసుపటేల్గూడ, పందుగూడ, రాయిగూడ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పర్యటించారు. 157వ బూత్ లెవెల్ ఆఫీసర్, బూత్ లెవెల్ ఏజెంట్ తొడసం భూపతితో కలిసి ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వాటి వివరాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సిరికొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరించాలి, ఏ వివరాలు నమోదు చేయాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సుంకిడి గ్రామ సర్పంచ్ రాథోడ్ గణపతి స్థానిక యువకులు, బీఎల్ఏతో కలిసి గ్రామంలో 200కు పైగా ఎన్యూమరేషన్ దరఖాస్తులను పూర్తి చేయించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పూర్కా జగన్, చవాన్ ప్రకాష్, స్థానిక నాయకులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



# ఊసేగాంలో తీవ్ర తాగునీటి సమస్య

- బావుల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్న గ్రామస్తులు



**జైనూర్:** మండలంలోని ఊసేగాం గ్రామంలో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గ్రామంలో సరిపడా మంచినీటి సరఫరా లేకపోవడంతో మహిళలు, యువకులు, చిన్నారులు ప్రతిరోజూ బావుల వద్ద గంటల తరబడి వేచి ఉండి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామంలో నీటి వనరులు తగ్గిపోవడం, పైప్లైన్ ద్వారా నీటి సరఫరా సక్రమంగా అందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక బిందె మంచినీటి కోసం కూడా ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కొరత కారణంగా ప్రజల దైనందిన జీవనం అస్తవ్యస్తంగా మారిందని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ట్యాంకర్ల ద్వారా అత్యవసరంగా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు గ్రామానికి నిరంతర మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

## మృతుని కుటుంబానికి సర్పంచ్ ఆర్థిక సహాయం



**వెల్దండ జూలై 03 :**

వెల్దండ మండల పరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు చంద్రయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, పోతేపల్లి సర్పంచ్ తగుళ్ల కొండల్ యాదవ్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తక్షణ ఖర్చులకు  గాను తన వ్యక్తిగతంగా రూ. 3 వేల రూపాయల నగదును అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఎగిరిశెట్టి శివకుమార్, ఉడుత బాలు, తాండ్ర సాయిబాబు, తాండ్ర అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల జూలై 10 న బంద్‌ను జయప్రదం చేయండి



**వెల్దండ జూలై 03 :**

వెల్దండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వామపక్ష విద్యార్థి సంఘాలు ఏ.ఎస్.ఎఫ్, ఎస్.ఎఫ్.ఐ, పిడిఎస్యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యార్థి బంద్‌ను విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయాల లేమి, హాస్టళ్లు, మెస్‌ల సమస్యలు, స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజుల దోపిడీ వంటి అనేక సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బలముల ప్రేమ్ కుమార్, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు రామానుజన్, పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**వెల్దండ జూలై 03 :**

వెల్దండ మండల పరిధిలోని పోతే పల్లి గ్రామానికి చెందిన ఒగ్గు చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని వార్డు నెంబర్ సభ్యులు గోరటి అశోక్ కుమార్ ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ద్వారా 3000 వేల రూపాయలు బి. ఆర్.ఎస్ పార్టీ మండల నాయకులు అంజి మాస్టర్ 3000 వేల రూపాయలు మృతుని కుటుంబ సభ్యులకు మొత్తం 6000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శారదా బాలయ్య గౌడ్, వార్డు నెంబర్ కృష్ణ గౌడ్,తాండ్ర సాయిబాబా,శ్రీను,అర్జున్, కొమ్ము భరత్, మధు, ఒగ్గు రాఘవేందర్ మరియు గ్రామస్తులుతదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే దోమల రహిత, ఆరోగ్యవంతమైన సైబరాబాద్ ను నిర్మించవచ్చు

**సైబరాబాద్ :**

, ప్రజల భాగస్వామ్యంతోనే దోమల రహిత, ఆరోగ్యవంతమైన సైబరాబాద్‌ను నిర్మించవచ్చని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తెలిపారు. "ప్రతి శుక్రవారం డ్రై డే" దోమల నివారణ అవగాహన కార్యక్రమాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణతో పాటు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు చేపడుతున్న చర్యల్లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మూడు జోన్ల పరిధిలో "ప్రతి శుక్రవారం డ్రై డే" దోమల నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి శుక్రవారం కేవలం 10 నిమిషాలు కేటాయించి ఇళ్లు, పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. శానిటేషన్ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

# తల్లిని ఇంట్లోంచి గెంటేసిన కర్కశ కుమారుడు



**ధర్మపురి, జూలై 03 :** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన 85 ఏళ్ల వృద్ధురాలు గంగధరి లక్ష్మి ని తన కన్న కుమారుడు ఇంట్లోంచి గెంటివేశాడని ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఘటనపై ఆమె సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ సహాయంతో ఆర్డీవో కార్యాలయాన్ని ఆశ్రయించారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద అధికారులు కేసు నమోదు చేశారు. అనంతరం ఆమె ఆర్డీవో కార్యాలయ ఆవరణలో విలేకరుల ఎదుట తన గోడును వెల్లబుచ్చుతూ కన్నీటి పర్యంతమయ్యారు. తన ఐదో కుమారుడు రాజేశం తాను స్వయంగా నిర్మించుకున్న ఇంట్లోంచి బలవంతంగా వెళ్లగొట్టాడని, తన పేరుపై ఉన్న పట్టా భూములను తన పేరిట రాయించుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. తనను ఆశ్రయించిన దత్తపుత్రుడు సురేం దర్, కూతురు ప్రమీలను కూడా బెదిరిస్తున్నాడని వాపో యారు. తనను ఇంటి నుంచి వెళ్లగొట్టిన కుమారుడిని తిరిగి ఇంట్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ముగ్గురు కుమారుల నుంచి నెలకు రూ.5 వేల చొప్పున పోషణ భత్యం తన ఖాతాలో జమ చేయించాలని వృద్ధురాలు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, వృద్ధుల సంరక్షణ అధికారి పి.సి. హన్మంత్ రెడ్డి, కూతురు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి

- **కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి**

**కుత్బుల్లాపూర్ :**



కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన పలు డివిజన్ అధ్యక్షులు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో పెటబషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, కొంపల్లి డివిజన్ అధ్యక్షులు ఆదిరెడ్డి మోహన్ రెడ్డి ,నిజాంపేట్ డివిజన్ అధ్యక్షులు కోటపాటి మురళి,బాచుపల్లి అధ్యక్షులు కోలన్ జీవన్ రెడ్డి,ప్రగతినగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి ), మహాదేవపురం డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ ముదిరాజ్, దూలపల్లి డివిజన్ అధ్యక్షులు బైరి శివ కుమార్ గౌడ్,షాపూర్ నగర్ డివిజన్ అధ్యక్షులు పాలకృష్ణ, బౌరంపేట్ డివిజన్ అధ్యక్షులు అర్కల విజయ్ గౌడ్, దుండిగల్ డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్ తదితరులు ఉన్నారు

## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్ :**



ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ డివిజన్ గణేష్ నగర్ లోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి, నాగ దేవత తల్లి ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, మహిమాన్విత పోచమ్మ తల్లి దయ ప్రజలందరిపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు బాలకృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శరత్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షులు కే.నర్సింహారెడ్డి, శివానంద్, శేఖర్ గుప్తా, కోశాధికారి బి.శ్రీనివాస్ రాజు, మురళి, శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి, సీనియర్ నాయకులు యాదగిరి (బాపు), వనం శ్రీనివాస్, సంపత్ మాధవ రెడ్డి, బొంబాయి శ్రీను, ఆంజనేయులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది

**కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్:**



మహిళల సంక్షేమం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి లోని పూజిత ఎంక్లేవ్ ప్రాంగణంలో డ్వాక్రా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరే విధంగా కృషి కొనసాగుతోందని అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళల అభివృద్ధి సమాజ అభివృద్ధికి మూలమని, ఇలాంటి కార్యక్రమాలు మహిళల పాత్రను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా గ్రామ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, యశోద, శ్రీవాణి, జ్యోతి , కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

- **కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మాజీ శాసనసభ్యు కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్ :**



పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో మరింత చురుకుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మాజీ శాసనసభ్యు కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలోని మేడిపల్లి, భీమారం మండలాల ముఖ్య నాయకుల సమావేశంతో పాటు సర్ కార్యక్రమంపై అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మాజీ శాసనసభ్యు కూన శ్రీశైలం గౌడ్ హాజరయ్యారు. ఈ సమావేశాన్ని వల్లంపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్ పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రజల్లో విస్తృత ప్రచారం, కార్యకర్తల సమన్వయం, రానున్న కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణపై నాయకులకు దిశానిర్దేశం చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలిసి కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం కార్యకర్తలకు అందుబాటులో ఉండే వేదికగా, ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్రబిందువుగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నందన్న, పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు ,ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



# జాతి గర్వించదగ్గ త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య

## నేడు 'భారత రత్న' వర్ధంతి!

స్వాతంత్ర్య సమరయోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి పింగళికి నివాళులు

'జపాన్ వెంకయ్య' నుండి 'పత్తి వెంకయ్య' వరకు ఎన్నో ప్రఖ్యాతులు

బెజవాడ కాంగ్రెస్ సభల్లో గాంధీజీ పిలుపుతో జెండా నమూనా ఆవిష్కరణ

ఖనిజ, భూగర్భ శాస్త్రవేత్తగా వజ్రాలు, మైకాపై అసాధారణ పరిశోధనలు

చివరి రోజుల్లో కడు దారిద్ర్యం.. గుడిసెలోనే గడిపిన జాతీయ వీరుడు

"చనిపోయాక నాపై జాతీయ జెండా కప్పండి".. పింగళి చివరి కోరిక

**నూట నలభై కోట్ల మంది భారతీయులు సగర్వంగా, సగౌరవంగా తలెత్తి వందనం చేసే భారత సార్వభౌమాధికార ప్రతీక.. మన త్రివర్ణ పతాకం. ఆ అద్భుత పతాకాన్ని దేశానికి ప్రసాదించిన అమరశిల్పి, తెలుగుజాతి ముద్దుబిడ్డ పింగళి వెంకయ్య వర్ధంతి నేడు (జూలై 4). కేవలం ఒక జెండా రూపకర్తగానే కాకుండా.. స్వాతంత్ర్య సమరయోధునిగా, గొప్ప వ్యవసాయ, భూగర్భ ఖనిజ శాస్త్రవేత్తగా, జపనీస్ భాషా బోధకునిగా, చిత్రకారునిగా బహుముఖ ప్రజ్ఞ చాటిన మహోన్నత వ్యక్తి పింగళి వెంకయ్య.**

కృష్ణాజిల్లా పెద్దకళ్ళేపల్లెలో 1878 ఆగస్టు 2న జన్మించిన వెంకయ్య, భట్లపెనుమర్రిలో విద్యాభ్యాసం ముగించారు. దేశభక్తి, అంతులేని జ్ఞానదాహం కలిగిన ఆయన.. తన 19వ ఏటనే ముంబై వెళ్లి సైన్యంలో చేరారు. మద్రాసులో ప్లేగ్ ఇన్‌స్పెక్టర్ శిక్షణ పొంది బళ్లారిలో పనిచేశారు. అనంతరం లంకకు వెళ్లి కొలంబో సిటీ కాలేజీలో పొలిటికల్ ఎకనమిక్స్ చదివి కేంబ్రిడ్జ్ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యారు. ఆపై లాహోర్ డి.ఎ.వి. కాలేజీలో చేరి సంస్కృతం, ఉర్దూ, జపాన్ భాషల్లో అసాధారణ పాండిత్యం సంపాదించి, అనర్గళంగా మాట్లాడటం వల్ల "జపాన్ వెంకయ్య"గా గుర్తింపు తెచ్చుకున్నారు. 1899-1902 మధ్య దక్షిణాఫ్రికాలో జరిగిన బోయర్ యుద్ధంలో పాల్గొన్న తరుణంలోనే.. ఆయనకు జాతిపిత మహాత్మా గాంధీతో పరిచయం ఏర్పడింది. ఆ సాన్నిహిత్యమే అర్ధశతాబ్దం పాటు దేశ సేవకు పునాది వేసింది. గాంధీజీ పరిచయమైన నాటి నుంచే భారతదేశానికి స్వంత జాతీయ జెండా ఉండాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా ప్రచారం ప్రారంభించారు పింగళి. 1916లో "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" (నీడ్ ఫర్ నేషనల్ ఫ్లాగ్) పేరిట 30 రకాల నమూనాలతో ఇంగ్లీషులో పుస్తకం రాశారు. 1921లో బెజవాడ (విజయవాడ)లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలకు గాంధీజీ స్వయంగా వెంకయ్యను పిలిపించి జెండాను చిత్రించమన్నారు. మహాత్ముని సూచనతో కాషాయం, ఆకుపచ్చ రంగుల మధ్య రాట్నంతో కూడిన జెండాను రూపొందించారు. అనంతరం సత్యం, అహింసలకు ప్రతీకగా తెలుపు రంగును కూడా అందులో చేర్చి, నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి అర్పించారు. "మడతపెడితే పిడికెడే.. కానీ కోట్లాది భారతీయుల ప్రియ వస్త్రం" అంటూ గాంధీజీ దీనిని కొనియాడారు. (తదనంతరం 1947 జూలై 22న రాజ్యాంగ సభలో నెహ్రూ తీర్మానం ద్వారా రాట్నం స్థానంలో అశోకుని 'ధర్మచక్రం' చేర్చారు).

వందేమాతరం, హోమ్‌రూల్, ఆంధ్రోద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న పింగళి వెంకయ్య.. మునగాల పరగణా నడిగూడెంలో ఉంటూ వ్యవసాయ క్షేత్రంలో మేలురకం పత్తి మొక్కలపై పరిశోధనలు చేశారు. "కంబోడియా పత్తి"పై ఆయన చేసిన కృషిని గుర్తించి బ్రిటీష్ ప్రభుత్వం సైతం మెచ్చుకోవడంతో ఆయనకు "పత్తి వెంకయ్య" అని పేరొచ్చింది. నెల్లూరు, వజ్రకరూరు, హంపి ప్రాంతాల్లో మైకా, వజ్రాలపై పరిశోధనలు చేసి 'వజ్రపు తల్లిరాయి' అనే గ్రంథాన్ని రాశారు. స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం ఆయనను ఖనిజ పరిశోధక శాఖ సలహాదారుగా నియమించినా, 1960లో ఆ గౌరవ వేతనాన్ని నిలిపివేసింది. దేశానికి అంతటి మహోన్నత గౌరవాన్ని తెచ్చిన పింగళి చరమాంకం అత్యంత దయనీయంగా సాగింది. వృద్ధాప్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. విజయవాడ చిట్టినగరులో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఒక చిన్న గుడిసె వేసుకుని దారిద్ర్య జీవితాన్ని గడపవలసి వచ్చింది. తిండికి కూడా మొహం వాచి నానా అగచాట్లు పడ్డారని సమకాలీన ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేశారు. కన్నుమూసే ముందు ఆయన తన చివరి కోరికగా.. "నేను చనిపోయిన తర్వాత నా భౌతిక కాయంపై త్రివర్ణ పతాకాన్ని కప్పండి. శ్మశానానికి చేరిన తర్వాత ఆ పతాకాన్ని తీసి అక్కడ ఉన్న రావి చెట్టుకు కట్టండి" అని కోరారు. ఆత్మాభిమానానికి మారుపేరైన పింగళి వెంకయ్య 1963 జూలై 4న విజయవాడలో కన్నుమూశారు. ఆ తర్వాత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించారు. గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించి గౌరవించింది. మువ్వన్నెల జెండాను చూసిన ప్రతిసారీ భారతీయుల గుండెల్లో పింగళి వెంకయ్య పేరు ఆచంద్రతారార్కం నిలిచే ఉంటుంది!

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# బ్రిటీషర్ల గుండెల్లోకి దూసుకుపోయిన విప్లవ బాణం.. అల్లూరి!

## మన్యం ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన అజరామర యోధుడు

## నేడు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి



భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో సాయుధ పోరాట మేరుశిఖరం, మన్యం ప్రజల ఆరాధ్య దైవం, అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు జయంతి నేడు (జూలై 4). మన్యం నిరుపేద గిరిజనుల హక్కుల కోసం, దేశ విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసి, కేవలం 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణాలర్పించిన మహోజ్వల విప్లవ జ్యోతి అల్లూరి. సాయుధ పోరాటం ద్వారానే పరాయి పాలన నుంచి విముక్తి లభిస్తుందని నమ్మిన ఆయన.. నిరక్షరాస్యులు, అమాయకులైన అటవీ బిడ్డలను సైన్యంగా మార్చి, అపార సైనిక సంపత్తి గల బ్రిటీషు సామ్రాజ్య పునాదులను కదిలించారు. హేవళంబి నామ సంవత్సరం, 1897 జూలై 4న విజయనగరం సమీపంలోని పాండ్రంగిలో మాతామహుల ఇంట జన్మించిన సీతారామరాజు.. పశ్చిమ గోదావరి జిల్లా మోగల్లులో పెరిగారు. తండ్రి వెంకట రామరాజు, తల్లి సూర్యనారాయణమ్మ. తొమ్మిదో తరగతి వరకే చదివినప్పటికీ సంస్కృతం, జ్యోతిష్యం, విలువిద్య, గుర్రపు స్వారీల్లో అసాధారణ ప్రావీణ్యం సంపాదించారు. 1916లో ఉత్తరభారత యాత్రకు బయలుదేరి బెంగాల్, కాశీ, లక్నో కాంగ్రెస్ మహాసభలు, అమృత్‌సర్, బదరీనాథ్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించారు. బ్రహ్మకపాలం వద్ద సన్యాసదీక్ష స్వీకరించి యోగిగా తిరిగొచ్చారు. ఆయుర్వేద వైద్యం, జ్యోతిష్యం, ఉదాత్త వ్యక్తిత్వంతో గిరిజనుల గుండెల్లో 'దేవుడు'గా స్థానం సంపాదించారు. 1917లో విశాఖపట్నం జిల్లా కృష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టిన రాజు.. తెల్లదొరల చేతిలో గిరిజనులు పడుతున్న నరకయాతనను కళ్లారా చూశారు. రక్షిత అటవీ ప్రాంతాల పేరుతో పోడు వ్యవసాయాన్ని నిషేధించడం, అటవీ ఉత్పత్తులను లాక్కోవడం, స్త్రీల మానహరణాలు వంటి బ్రిటీష్ ముఠా అరాచకాలపై రాజు రక్తం మరిగింది. గంటందొర, మల్లుదొర, అగ్గిరాజు (వేగిరాజు సత్యనారాయణ రాజు) వంటి 150 మంది సాహస వీరులను చేరదీసి సాయుధ విప్లవానికి నాంది పలికారు. 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడితో మన్యం విప్లవం ప్రారంభమైంది. ఆ తర్వాత వరుసగా కృష్ణదేవుపేట, రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం స్టేషన్లను ముట్టడించి ఆయుధాలను స్వాధీనం చేసుకుని ఆంగ్లేయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు.

### అమరత్వం.. రూథర్‌ఫర్డ్‌తో చారిత్రక సంభాషణ

గిరిజనులను బ్రిటీష్ సైన్యం పెట్టే హింసలను చూడలేక, తనను తాను త్యాగం చేసుకోవడానికి సిద్ధపడిన అల్లూరి.. 1924 మే 7న కొయ్యూరు సమీపంలోని ఏటి ఒడ్డున స్నానం చేస్తుండగా బ్రిటీష్ సైన్యానికి చిక్కారు. బందీగా ఉన్న రాజును మేజర్ గుడాల్ ఏ విచారణ లేకుండా చెట్టుకు కట్టేసి అత్యంత క్రూరంగా కాల్చి చంపాడు. చనిపోయే ముందు బ్రిటీష్ అధికారి రూథర్‌ఫర్డ్.. "నీలాంటి వీరుడు మా దేశంలో పుట్టి ఉంటేనా.." అన్న ప్రశ్నకు అల్లూరి ఇచ్చిన సమాధానం అజరామరం: "పొరపాటున కూడా అలా ఊహించవద్దు. ఇది నా మాతృభూమి. ఇక్కడి మట్టి, నీరు, గాలి పవిత్రం. వేయి జన్మలకైనా ఈ పుణ్యభూమిలోనే పుడతాను. నేను కోరేది అట్టడుగున ఉన్న మనిషి కూడా స్వేచ్ఛా వాయువులు పీల్చే స్వరాజ్యం!"

ఒక్క సీతారామరాజును చంపితే లక్షలాది మంది సీతారామరాజులు ఉద్భవిస్తారని గర్జించిన ఆ విప్లవ వీరుడి దేహాన్ని మే 8న దహనం చేసి, చితాభస్మాన్ని వరాహ నదిలో కలిపారు. అల్లూరి ఒక వ్యక్తి కాదు.. ఒక సమూహ శక్తి, భారత స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరగని సంగ్రామ భేరి. ఆయన జయంతి సందర్భంగా ఆ అమరవీరుడికి శతకోటి ప్రణామాలు!

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య



## విప్లవ గడ్డపై రగిలిన తొలి నిప్పుకణిక!

నిజాం నియంతృత్వం, భూస్వామ్య దోపిడీపై ఉవ్వెత్తున ఎగిసిన ధీర కెరటం

'కడివెండి'లో దేశ్‌ముఖ్ అరాచకాలపై గుత్పలు, వడిసెలతో ప్రజా తిరుగుబాటు

సాయుధ పోరాటానికి మారుపథం.. 'దున్నేవాడిదే భూమి' నినాదానికి ఊపిరి

**తెలంగాణ చరిత్రలో దొడ్డి కొమరయ్య పేరు ఒక శాశ్వత చిహ్నం. అతను ఒక వ్యక్తి కాదు – ఒక చైతన్యం, ఒక ఉద్యమ కెరటం. భూస్వామ్య దోపిడీ, వెట్టి చాకిరి, జాతి వివక్ష, నిజాం నియంతృత్వం వంటి అన్యాయాలపై తొలి ఉద్యమపు అగ్రశ్రేణి పోరాట యోధుడు. ప్రజల జీవన హక్కుల కోసం పోరాడుతూ తన ప్రాణాన్ని అర్పించిన తొలి అమరుడు. ఈయన కథ తెలంగాణ ప్రజల చరిత్రలో మరచి పోలేని విప్లవగాథ.**

### వెట్టి చాకిరి - నిజాం కాలపు చీకటి అధ్యాయం:

తెలంగాణ సాయుధ పోరాటానికి పూర్వ నేపథ్యం తెలుసుకోవాల్సి వస్తే, నిజాం పాలిత హైదరాబాద్ సంస్థానంలోని సామాజిక పరిస్థితుల వైపు దృష్టి మళ్లించాలి. నిజాం రాజ్య వ్యవస్థ బ్రిటీషు వలస పాలనను దాటిపోయే విధంగా ఫ్యూడల్ భూస్వామ్యపు పెత్తనాన్ని నిగ్రహ రహితంగా అమలు చేసింది. పేద రైతులు తమ భూముల్లోనూ భూస్వాముల అనుమతి లేకుండా సాగు చేయలేని స్థితి. బలవంతపు పన్నులు, వడ్డీలు, శ్రమ దోపిడీ సామాన్య జీవనాన్ని అంధకారపు తెరల్లోకి నెట్టేశాయి.

**వెట్టి చాకిరి – అశేష తెలంగాణ ప్రజానీకం దశాబ్దాల తరబడి ఎదుర్కొన్న శాప గ్రస్త జీవితం. వ్యవసాయ భూములు నిజాం ప్రభుత్వానికే చెందాలన్న భావ జాలంతో, దొరలు దేశ్‌ముఖ్‌లుగా నియమితులై ప్రజలపై రాజనీతి, ఆర్థికంగా ఆడి పాడారు. విభిన్న పేర్లతో బహుళ రకాల పన్నుల భారం ప్రజలపై మోప బడింది. తల్లిదండ్రుల బాకీ తాళం విడిపించు కోవాలంటే, వారి పిల్లలు దొరల ఇంట్లో పనులు చేయాల్సిన దుస్థితి. ఇది కేవలం ఆర్థిక అంశం కాదు – ఇది మానవీయ హక్కుల విషయం.**

ఈ నిష్ఠూర పాలనకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు కమ్యూనిస్టు పార్టీ ఓ మార్గదర్శక పాత్ర పోషించింది. విప్లవ ప్రచార కర్తలు గ్రామాల చుట్టూ తిరుగుతూ భూస్వామ్య దోపిడీపై ప్రజలకు అవగాహన కల్పించారు. సంఘాల రూపంలో గ్రామ స్థాయిలో ప్రజా సంఘటనలు ఆవిర్భవించాయి. ఇదే సమయంలో, యువతలో ఉద్యమ స్ఫూర్తి మేల్కొంది. ఆ యువశక్తిలో అగ్రగామిగా నిలిచిన వ్యక్తి – దొడ్డి కొమరయ్య.

### కడివెండి విప్లవ గడ్డ.. సంఘాల ఏర్పాటు

కొమరయ్య 1927 ఏప్రిల్ 3న వరంగల్ జిల్లా లోని (ప్రస్తుతం జనగామ జిల్లా) దేవరుప్పుల మండలానికి చెందిన కడివెండి గ్రామంలో పుట్టాడు. కుమ వృత్తి నిరత కుటుంబంలో పుట్టినా, ధైర్యమే ఆయన మూలధనం. చిన్న వయస్సులోనే వ్యవసాయ శ్రమలో పాల్గొన్న ఆయన, దొరల అరాచకాల పట్ల అసహనంతో ఉన్నాడు. అతని అన్న దొడ్డి మల్లయ్య కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకైన నాయకుడు. ఆ ప్రభావంతో కొమరయ్య బాల్యం లోనే ప్రజా సమస్యలపై స్పందించడం ప్రారంభించాడు. ప్రజల్లో ఉన్న భయాన్ని చెరిపి వేసే ధైర్యం, చైతన్యం ఆయన వాణిలో ప్రతిఫలించేది. కడివెండి గ్రామంలోని దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి, అతని తల్లి జానకమ్మలు ప్రజల భూములు, పంటలు, పశువులపై తమదైన హక్కులున్నట్లు ప్రవర్తించేవారు. ప్రజలు నిరంతరం దాడులకు, అవమానాలకు గురయ్యేవారు. దొడ్డి మల్లయ్య ఆధ్వర్యంలో "గుత్పల సంఘం", "వడిసెల సంఘం", "కారంపొడి సంఘం"లు ఏర్పడ్డాయి. వీటివల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. కొమరయ్య ఈ సంఘాల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు చైతన్యం తీసుకొచ్చాడు. అన్యాయాలను భరించ వద్దని, తిరగ బడాలని నినదించాడు.

### ఆ రక్తతర్పణం.. చరిత్రను మార్చిన జూలై 4:

1946 జూలై 4వ తేదీ – తెలంగాణ చరిత్రలో మరిచి పోలేని రోజు. దేశ్‌ముఖ్ గడిపై తిరుగుబాటు చేయాలని నిర్ణయించిన గ్రామ ప్రజలు ఊరేగింపుగా, నినాదాలతో ముందుకు సాగారు. దొడ్డి మల్లయ్య, దొడ్డి కొమరయ్య ముందుండి నడిపించారు. గడిలో దాగి ఉన్న రజాకార్లు, దేశ్‌ముఖ్ బంట్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దొడ్డి కొమరయ్య ఛాతీలో బుల్లెట్ తగిలి అక్కడికక్కడే వీరమరణం పొందాడు. అప్పటికి అతని వయస్సు కేవలం 19 సంవత్సరాలు మాత్రమే. ఈ సంఘటన తెలంగాణ సాయుధ పోరాటానికి మారుపథాన్ని ఇచ్చింది. అప్పటివరకు వాదనలతో, వ్యతిరేకతలతో సాగిన ఉద్యమం ఇకపై తుపాకులతో, ప్రాణాల బలిదానాలతో సాగవలసిన నిశ్చయానికి వచ్చిందని ఈ సంఘటన తెలియ జేసింది. కొమరయ్య మరణం విన్న గ్రామాలు రగిలి పోయాయి. దొరల గడులు కాలి పోయాయి. భూస్వామ్య వ్యతిరేకత తెలంగాణ మట్టిలో విప్లవ స్వరూపాన్ని తీసుకుంది. "దున్నేవాడిదే భూమి" అన్న నినాదం మానవ హక్కుగా మారింది.

### ఉద్యమ స్ఫూర్తి.. అమరత్వానికి ప్రతీక:

1946 నుంచి 1951 వరకు సాగిన ఈ సాయుధ పోరాటంలో వేలాది మంది యువకులు ప్రాణాలను పణంగా పెట్టారు. లక్షల ఎకరాల భూమి లేని పేదలకు పంచబడింది. నిజాం పాలన కుదేలైంది. 1948 సెప్టెంబర్ 17న "ఆపరేషన్ పోలో" ద్వారా భారత ప్రభుత్వం హైదరాబాద్ సంస్థానాన్ని భారత సమాఖ్యలో విలీనం చేయ గలిగింది. ఇది తక్షణ విజయంగా కనిపించినా, దాని వెనుక శ్రమించిన అమరుల రక్తం, ధైర్యం మసక బారనిది. దొడ్డి కొమరయ్య ఆ అమరులలో తొలి జ్యోతి.

**ఆయన త్యాగం కేవలం తెలంగాణ సాయుధ పోరాటానికి మాత్రమే కాదు, దశాబ్దాల తర్వాత ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి కూడా బలాన్నిచ్చింది. కొమరయ్య పేరు జెండాలపై మెరిసింది, నినాదాలలో పలికింది, ప్రజా పాటల గుండెల్లో వినిపించింది. విద్యార్థి సంఘాల పేర్లలో ఆయనను గుర్తు చేసుకున్నారు. ఉద్యమాలలో స్ఫూర్తిగా నిలిచారు. దొడ్డి కొమరయ్య – పేదల హక్కుల కోసం ప్రాణం అర్పించిన తొలి దీపం. అణచివేతకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగిసిన ధీర కెరటం. ప్రజల గుండెల్లో చిరకాలం నిలిచే తెలంగాణ యోధ కిషోరం.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్, జులై 3 :** గత కొన్ని రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు మళ్లీ పెరుగుదల బాట పట్టాయి. బుధవారం వరకు వరుసగా తగ్గిన పసిడి ధరలు గురువారం నుంచి తిరిగి పెరగడం ప్రారంభమైంది. శుక్రవారం కూడా అదే ధోరణి కొనసాగడంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి మరోసారి అదనపు భారం పడింది. శుక్రవారం ఉదయం నమోదైన ధరల ప్రకారం హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,000కు చేరుకుంది. ఇది గురువారం ధరతో పోలిస్తే రూ.2,450 పెరిగింది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,34,750గా నమోదై ఒక్కరోజులోనే రూ.2,250 పెరిగింది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,10,250గా కొనసాగుతోంది. వెండి ధర కూడా ఒక్కసారిగా పెరిగింది. కిలో వెండి ధర ప్రస్తుతం రూ.2,60,000గా ఉండగా, గురువారం ధరతో పోలిస్తే రూ.10 వేల మేర పెరుగుదల నమోదైంది. తెలంగాణలో హైదరాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,000గా ఉంది. 22 క్యారెట్ల బంగారం రూ.1,34,750, 18 క్యారెట్ల బంగారం రూ.1,10,250గా కొనసాగుతోంది. ఇదే ధరలు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కూడా నమోదయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో చెన్నైలో బంగారం ధర అత్యధికంగా ఉంది. అక్కడ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,560, 22 క్యారెట్ల బంగారం రూ.1,37,000గా ఉంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రూ.1,47,150, ముంబై, కోల్‌కతా, బెంగళూరు, కేరళలో రూ.1,47,000గా కొనసాగుతోంది. అహ్మదాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,050గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, డాలర్ మారకం విలువలో హెచ్చుతగ్గులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పెట్టుబడిదారుల కొనుగోళ్ల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు మారుతున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ పరిణామాలను బట్టి పసిడి ధరల్లో మరిన్ని మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

## న్యాక్ ప్యాకేజింగ్ ఐపీఓకు భారీ స్పందన




**ముంబై, జులై 3:** భారతీయ ప్రాథమిక షేర్ల మార్కెట్‌లో కొత్త కంపెనీల షేర్ల విక్రయాలకు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన కొనసాగుతోంది. తాజాగా న్యాక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ కంపెనీ ప్రారంభించిన షేర్ల విక్రయం చివరి రోజైన శుక్రవారం భారీగా దరఖాస్తులు అందుకుంటోంది. జులై 1న ప్రారంభమైన ఈ షేర్ల విక్రయం జులై 3తో ముగియనుండగా, చివరి రోజు మధ్యాహ్నానికే పలు విభాగాల్లో అనూహ్య స్థాయిలో స్పందన లభించింది. మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఈ షేర్ల విక్రయం మొత్తం మీద 18 రెట్లకు పైగా దరఖాస్తులు అందుకోగా, మధ్యాహ్నం తర్వాత అది 22 రెట్లకు మించి చేరినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగంలో అత్యధిక స్పందన నమోదైంది. ఈ విభాగంలో కేటాయించిన వాటా ఇప్పటికే 50 రెట్లకు పైగా భర్తీ అయింది. అర్హత కలిగిన సంస్థాగత పెట్టుబడిదారుల విభాగంలో 10 రెట్లకు పైగా, సాధారణ రిటైల్ పెట్టుబడిదారుల విభాగంలో సుమారు 8.7 రెట్లకు పైగా దరఖాస్తులు నమోదయ్యాయి. సాయంత్రం దరఖాస్తుల గడువు ముగిసేలోపు ఈ సంఖ్యలు మరింత పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ షేర్ల విక్రయం ద్వారా కంపెనీ మొత్తం రూ.439.50 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.380 కోట్ల విలువైన కొత్త షేర్ల జారీతో పాటు, రూ.59.50 కోట్ల విలువైన ఇప్పటికే ఉన్న షేర్ల విక్రయం కూడా ఉంది. ఒక్కో షేరు ధరను రూ.161 నుంచి రూ.170 మధ్య నిర్ణయించారు. కనీసంగా ఒక లాట్‌కు 88 షేర్ల కోసం దరఖాస్తు చేయాల్సి ఉండగా, గరిష్ఠ ధర ప్రకారం రిటైల్ పెట్టుబడిదారుడు కనీసం రూ.14,960 పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అనధికారిక మార్కెట్‌లో కూడా ఈ కంపెనీ షేర్లకు మంచి డిమాండ్ కనిపిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఒక్కో షేరుపై రూ.28 నుంచి రూ.32 వరకు అదనపు ధర పలుకుతున్నట్లు సమాచారం. దీంతో షేరు మార్కెట్లో జాబితాలో చేరిన తొలి రోజే సుమారు 16 నుంచి 20 శాతం వరకు లాభం వచ్చే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ఇవి కేవలం మార్కెట్ అంచనాలు మాత్రమేనని, వాస్తవ ధరలు మార్కెట్ పరిస్థితులను బట్టి మారే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గుజరాత్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న న్యాక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ దేశీయ మార్కెట్‌తో పాటు 71కి పైగా దేశాలకు ప్యాకేజింగ్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఇటీవల ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.823.4 కోట్ల ఆదాయాన్ని, రూ.92.8 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. కంపెనీ వ్యాపార విస్తరణ కోసం గుజరాత్‌లో కొత్త తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఈ నిధులను వినియోగించనున్నట్లు వెల్లడించింది.

ప్రముఖ బ్రోకరేజ్ సంస్థలు కూడా ఈ షేర్ల విక్రయానికి అనుకూల అభిప్రాయం వ్యక్తం చేశాయి. కంపెనీ విలువ, ఆర్థిక పనితీరు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్



**ముంబై, జూలై 3 :** దేశీయ స్టాక్ మార్కెట్ శుక్రవారం లాభాలతో ముగిసింది. వరుసగా మూడో ట్రేడింగ్ రోజూ సూచీలు సానుకూలంగా ముగియడంతో ఈ వారాంతాన్ని మార్కెట్ ఉత్సాహంగా ముగించింది. రోజంతా లాభాల స్వీకరణ, ఒడిదుడుకులు కనిపించినప్పటికీ చివరికి కొనుగోళ్ల ఊపు పెరగడంతో ప్రధాన సూచీలు గ్రీన్ జోన్‌లో నిలిచాయి. ఉదయం ట్రేడింగ్ ప్రారంభం నుంచే మార్కెట్‌లో సానుకూల ధోరణి కనిపించింది. ప్రారంభంలోనే సెన్సెక్స్ దాదాపు 450 పాయింట్లు, నిఫ్టీ 150 పాయింట్లకు పైగా లాభపడ్డాయి. అనంతరం మధ్యాహ్నం లాభాల స్వీకరణ ప్రభావంతో కొంత మేర ఒత్తిడి కనిపించినా, చివరి గంటలో కొనుగోళ్లు పుంజుకోవడంతో సెన్సెక్స్ 261 పాయింట్ల లాభంతో 77,763 వద్ద, నిఫ్టీ 95 పాయింట్ల లాభంతో 24,270 వద్ద ముగిశాయి. ఐటీ రంగం మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు దాదాపు 5.80 శాతం ఎగబాకి అత్యధిక లాభదారుగా నిలిచింది. టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా షేర్లు కూడా మంచి లాభాలను నమోదు చేశాయి. రియాల్టీ, సమాచార సాంకేతిక, వినియోగ వస్తువులు, లోహ, ఔషధ రంగాల షేర్లలో కొనుగోళు కనిపించాయి. మరోవైపు బ్యాంకింగ్ రంగంలోని కొన్ని షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 1.56 శాతం నష్టపోగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, లార్సన్ అండ్ టూబ్రో షేర్లు కూడా స్వల్ప నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర 71 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.22 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్స్ ధర 4,179 డాలర్ల వద్ద నమోదైంది.

ఆసియా మార్కెట్లలో కూడా సానుకూల ధోరణి కనిపించింది. దక్షిణ కొరియా కోస్పి సూచీ సుమారు 1.4 శాతం, జపాన్ నిక్కీ సూచీ 0.3 శాతం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం కూడా దేశీయ మార్కెట్‌కు మద్దతుగా నిలిచిందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కూరగాయల ధరలతో సామాన్యులకు భారం



**అమరావతి, జులై 3 :** ఆంధ్రప్రదేశ్‌లో కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. వేసవి ముగిసి వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ కూరగాయల ధరలు తగ్గకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టమాటా మినహా దాదాపు అన్ని రకాల కూరగాయల ధరలు భారీగా పెరగడంతో మార్కెట్‌కు వెళ్లాలంటేనే ప్రజలు ఆలోచించే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం క్యాప్సికం, చిక్కుడు ధరలు కిలోకు రూ.100కు పైగా పలుకుతున్నాయి. క్యారెట్ కిలో రూ.80కు చేరగా, బీట్‌రూట్, పచ్చిమిర్చి కిలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. అల్లం, వెల్లుల్లి ధరలు మరింత పెరిగి కిలో రూ.220 వరకు చేరడంతో వంటింటి ఖర్చులు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతుండటంతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ దెబ్బతింటోంది. ముఖ్యంగా మధ్యతరగతి, రోజువారీ కూలీల కుటుంబాలు పెరిగిన ధరల ప్రభావాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నాయి. గతంతో పోలిస్తే ప్రతి రోజు కూరగాయల కొనుగోలుకే ఎక్కువ మొత్తాన్ని వెచ్చించాల్సి వస్తోందని వినయోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు అధిక లాభాలను ఆశిస్తూ ధరలను పెంచుతున్నారని పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. మరోవైపు పంట దిగుబడి తగ్గడం, సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలు కూడా ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మార్కెట్లలో ధరలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, వినియోగదారులకు అందుబాటు ధరల్లో నాణ్యమైన కూరగాయలు లభించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో సామాన్యులపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

# రూ.186 కుకీతో ఉద్యోగం పోయింది

## చివరికి కంపెనీకే షాక్

**వాషింగ్టన్, జులై 3 :** అమెరికాకు చెందిన ప్రముఖ వాహన తయారీ సంస్థ ఫోర్డ్‌లో జరిగిన ఓ ఘటన ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేవలం 1.95 డాలర్ల విలువైన కుకీని దొంగిలించాడనే ఆరోపణలతో 11 ఏళ్లుగా పనిచేస్తున్న ఓ సీనియర్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించిన సంస్థ, తర్వాత అతనే నిర్దోషి అని తేలడంతో విమర్శలు ఎదుర్కొంటోంది. అమెరికాలోని కెంటకీ రాష్ట్రంలోని ఫోర్డ్ ట్రక్ తయారీ కేంద్రంలో 11 ఏళ్లుగా పనిచేస్తున్న 60 ఏళ్ల కుర్ట్ క్రోమ్ వారానికి సగటున 60 గంటలకు పైగా విధులు నిర్వర్తించేవారు. ఆయన వార్షిక వేతనం సుమారు రెండు లక్షల అమెరికా డాలర్లు. ఒకరోజు విధుల్లో ఉండగా రక్తంలో చక్కెర స్థాయులు తగ్గిపోవడంతో వెంటనే అక్కడి క్యాంటీన్‌లో 1.95 డాలర్ల విలువైన కుకీ కొనుగోలు చేసి తిన్నారు. కొద్దిసేపటికే సంస్థ అధికారులు ఆయనను కార్యాలయానికి పిలిచి, కుకీని చెల్లించకుండా తీసుకున్నారని ఆరోపిస్తూ వీడియో ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగుల సంఘం ప్రతినిధి సమక్షంలోనే ఆయనను ఉద్యోగం నుంచి తొలగించి కార్యాలయం నుంచి బయటకు పంపించారు. తాను గత ఏడాదిలోనే అదే క్యాంటీన్‌లో వేల డాలర్లు ఖర్చు చేశానని, అలాంటప్పుడు కేవలం 1.95 డాలర్ల కోసం దొంగతనానికి పాల్పడాల్సిన అవసరం తనకు లేదని కుర్ట్ క్రోమ్ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఈ ఘటన తర్వాత తన బ్యాంకు ఖాతా లావాదేవీలను పరిశీలించిన కుర్ట్ క్రోమ్, కుకీ కొనుగోలుకు సంబంధించిన మొత్తం తన ఖాతా నుంచి చెల్లించినట్లు గుర్తించారు. ఆ వివరాలను సంస్థకు పంపినా, వాటిని అధికారిక ధ్రువీకరణతో సమర్పించాలని యాజమాన్యం కోరింది. అనంతరం క్యాంటీన్ నిర్వహిస్తున్న సంస్థ కూడా కుకీకి సంబంధించిన చెల్లింపు పూర్తిగా జరిగిందని అధికారికంగా ధ్రువీకరించింది. దీంతో తమ తప్పు తెలుసుకున్న ఫోర్డ్ యాజమాన్యం తిరిగి ఉద్యోగంలో చేరాలని కుర్ట్ క్రోమ్‌ను కోరినట్లు సమాచారం. అయితే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన సంస్థలో మళ్లీ పనిచేయడానికి ఆయన నిరాకరించారు. ఇదిలా ఉండగా, ఆయనకు మరో సంస్థలో అంతకంటే మెరుగైన వేతనంతో కొత్త ఉద్యోగం లభించింది. ఈ ఘటన ఉద్యోగుల పట్ల సంస్థలు వ్యవహరించే తీరుపై మరోసారి చర్చకు దారితీసింది. పూర్తి స్థాయి విచారణ లేకుండానే ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం ఎంతటి పరిణామాలకు దారితీస్తుందో ఈ సంఘటన స్పష్టం చేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.





# పెట్రోల్ ధరలు ఇప్పట్లో తగ్గేలా లేవు

**న్యూఢిల్లీ, జులై 3 :** పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయనే ఆశతో ఎదురుచూస్తున్న వినియోగదారులకు ఇప్పట్లో ఊరట లభించే పరిస్థితి కనిపించడం లేదు. ప్రైవేటు ఇంధన సంస్థ నయారా ధరలను తగ్గించినప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు మాత్రం ప్రస్తుతం ధరల్లో ఎలాంటి మార్పు చేయడానికి సిద్ధంగా లేవని సమాచారం. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ సంస్థలు అంతర్జాతీయ ముడి చమురు మార్కెట్ పరిస్థితులను పరిశీలించిన తర్వాతే ధరలపై నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ధరల తగ్గింపు ప్రక్రియ మరికొంత కాలం వాయిదా పడే అవకాశం ఉందని జాతీయ స్థాయి మాధ్యమాల కథనాలు పేర్కొంటున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ప్రభుత్వ రంగ చమురు సంస్థలు గణనీయమైన ఆర్థిక భారం ఎదుర్కొన్నట్లు సమాచారం. ఆ నష్టాలను భర్తీ చేసుకునే ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం అమల్లో ఉన్న ఇంధన ధరలను మరో రెండు నెలల పాటు కొనసాగించాలని ఆయా సంస్థలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పూర్తిగా స్థిరపడిన తర్వాతే ధరల తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు యథాతథంగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రైవేటు సంస్థలు ధరలను కొంత మేర తగ్గించినా, ప్రభుత్వ రంగ సంస్థలు మాత్రం పాత ధరలనే కొనసాగించడం వల్ల వాహనదారులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదు. దీంతో నిత్య ప్రయాణాలు చేసే ప్రజలు, రవాణా రంగంపై ఆధారపడే వర్గాలపై ఇంధన వ్యయం భారం కొనసాగుతోంది. అయితే ఇప్పటివరకు పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం వెలువడుతున్న సమాచారం జాతీయ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, మార్కెట్ వర్గాల అంచనాల ఆధారంగానే ఉంది. వినియోగదారులకు ఎప్పుడు ఊరట లభిస్తుందనే విషయంపై అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

# స్వదేశంలో ఐదో కప్‌పై ఇంగ్లండ్ గురి

**లండన్, జులై 3 :**
మహిళల ట్వంటీ-20 ప్రపంచకప్ తుది పోరుకు మరో రెండు రోజులే మిగిలి ఉండటంతో క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. లీగ్ దశలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అద్భుత ప్రదర్శన చేసిన ఇంగ్లండ్, సెమీఫైనల్లోనూ అదే జోరు కొనసాగించి ఫైనల్‌కు చేరుకుంది. మరోవైపు ఆరుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా కూడా మరోసారి టైటిల్ కోసం బరిలోకి దిగుతోంది. ఆదివారం లార్డ్స్ మైదానంలో జరగనున్న ఈ తుది సమరంలో ఎవరు విజేతగా నిలుస్తారనే దానిపై ఆసక్తి నెలకొంది. స్వదేశంలో జరిగే అంతర్జాతీయ టోర్నీల్లో ఇంగ్లండ్‌కు అత్యుత్తమ రికార్డు ఉంది. ఇప్పటివరకు తమ గడ్డపై నిర్వహించిన నాలుగు అంతర్జాతీయ ప్రపంచకప్ టోర్నీల్లో ఒక్కసారి కూడా టైటిల్‌ను చేజార్చుకోలేదు. ఈసారి కూడా అదే విజయ పరంపరను కొనసాగించి ఐదోసారి స్వదేశంలో ప్రపంచకప్‌ను సొంతం చేసుకోవాలని ఇంగ్లండ్ జట్టు పట్టుదలతో ఉంది. నాట్ సీవర్ బ్రంట్ నాయకత్వంలోని జట్టు అన్ని విభాగాల్లో సమతూకంగా కనిపిస్తోంది. ఇది మహిళల ట్వంటీ-20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌కు ఐదో ఫైనల్. గతంలో 2009, 2012, 2014, 2018 సంవత్సరాల్లో ఫైనల్‌కు చేరిన ఈ జట్టు, 2009లో తొలి ట్వంటీ-20 ప్రపంచకప్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా మహిళల వన్డే ప్రపంచకప్‌లలో కూడా 1973, 1993, 2017 సంవత్సరాల్లో విజేతగా నిలిచి ప్రపంచ క్రికెట్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 2009లో జరిగిన తొలి మహిళల ట్వంటీ-20 ప్రపంచకప్ ఫైనల్లో న్యూజిలాండ్‌ను ఓడించి ఇంగ్లండ్ తొలి ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే స్వదేశంలో నిర్వహించిన మహిళల వన్డే ప్రపంచకప్‌లలోనూ వరుస విజయాలు నమోదు చేసింది. ఈ చరిత్ర ఇప్పుడు ఇంగ్లండ్‌కు అదనపు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది. అయితే ప్రత్యర్థి ఆస్ట్రేలియాను తక్కువ అంచనా వేయలేమని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ఆరుసార్లు ట్వంటీ-20 ప్రపంచకప్‌ను గెలిచిన ఆస్ట్రేలియా పెద్ద మ్యాచ్‌లలో ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించడంలో ఎంతో అనుభవం కలిగిన జట్టు. అందువల్ల ఫైనల్లో అనుభవం, ఆత్మవిశ్వాసం, సమిష్టి ప్రదర్శన కీలకంగా మారనున్నాయి. రెండు జట్లూ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో సమాన బలంతో కనిపిస్తుండటంతో తుది పోరు హోరాహోరీగా సాగుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరిగే ఈ మ్యాచ్‌లో ఎవరు ప్రపంచ విజేతగా నిలుస్తారో తెలుసుకోవాలంటే ఆదివారం వరకు వేచి చూడాల్సిందే.








## రిటైర్మెంట్‌పై రొనాల్డో స్పష్టత

**న్యూయార్క్, జులై 3 :** ప్రపంచకప్ మధ్యలో తన రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలకు పోర్చుగల్ స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో పూర్తి స్పష్టత ఇచ్చాడు. ప్రస్తుతం తన దృష్టి మొత్తం ప్రపంచకప్‌పైనే ఉందని, కెరీర్‌కు సంబంధించిన నిర్ణయం టోర్నమెంట్ ముగిసిన తర్వాతే తీసుకుంటానని వెల్లడించాడు. క్రొయేషియాతో జరిగిన ప్రపంచకప్ 32వ రౌండ్ మ్యాచ్‌లో అద్భుత గోల్ చేసి పోర్చుగల్ విజయానికి కీలక పాత్ర పోషించిన రొనాల్డో, మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడాడు. తన సోదరి కతియా అవీరో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తాను ఇప్పుడే ఫుట్‌బాల్‌కు వీడ్కోలు చెప్పబోవడం లేదని స్పష్టం చేశాడు. రిటైర్మెంట్ గురించి ఇప్పుడు మాట్లాడాల్సిన అవసరం లేదని రొనాల్డో పేర్కొన్నాడు. ప్రపంచకప్‌లో విజయం సాధించినా, ఓటమి ఎదురైనా టోర్నమెంట్ పూర్తయ్యాక కుటుంబ సభ్యులతో చర్చించి తుది నిర్ణయం వెల్లడిస్తానని తెలిపాడు. ప్రస్తుతం జరుగుతున్న పోటీలపై పూర్తిగా దృష్టి సారించినందున భవిష్యత్ నిర్ణయాల గురించి ఆలోచించడం లేదని చెప్పాడు. ప్రస్తుత క్షణాలను ఆస్వాదిస్తూ పోర్చుగల్ విజయాల్లో తన వంతు పాత్ర పోషించడమే తన లక్ష్యమని రొనాల్డో పేర్కొన్నాడు. ప్రపంచకప్ ముగిసిన తర్వాతే తన భవిష్యత్ ప్రణాళికలపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యలతో స్పష్టమైంది.

# సుదర్శన్, పడిక్కల్ జోరు..

## భారత్-ఏ భారీ స్కోరు దిశగా

**గాలే, జులై 3 :**
శ్రీలంక-ఏతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్-ఏ బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. ఓపెనర్లు సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్ అజేయ అర్ధశతకాలతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపారు. గాలే వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఇద్దరూ శతక భాగస్వామ్యాన్ని నెలకొల్పి శ్రీలంక-ఏ బౌలర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టారు. చేతిలో ఇంకా తొమ్మిది వికెట్లు ఉండటంతో భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే దిశగా దూసుకెళ్తోంది. శ్రీలంక పర్యటనలో తొలి అనధికారిక టెస్టు డ్రాగా ముగియడంతో రెండో మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా భారత్-ఏ బరిలోకి దిగింది. ఆ లక్ష్యానికి తగ్గట్టుగానే బ్యాటర్లు ధాటిగా ఆడుతున్నారు. ఓపెనర్ అమన్ మొఖాడే 38 పరుగులు చేసి అవుటైనా, ఆ తర్వాత సాయి సుదర్శన్, దేవ్‌దత్ పడిక్కల్ కలిసి ఇన్నింగ్స్‌ను చక్కగా ముందుకు నడిపించారు. సాయి సుదర్శన్ 87 పరుగులతో, దేవ్‌దత్ పడిక్కల్ 74 పరుగులతో అజేయంగా క్రీజులో నిలిచి శతకం దిశగా సాగుతున్నారు. వీరిద్దరి అద్భుత భాగస్వామ్యంతో 50 ఓవర్లు ముగిసే సమయానికి భారత్-ఏ ఒక వికెట్ నష్టానికి 194 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులు వెనుకబడి ఉంది. అంతకుముందు టాస్ గెలిచిన భారత్-ఏ బౌలింగ్ ఎంచుకుంది. శ్రీలంక-ఏ తొలి ఇన్నింగ్స్‌లో కెప్టెన్ సహన్ అరాచ్చిగా 127 పరుగులతో శతకం సాధించినా, మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో శ్రీలంక-ఏ 366 పరుగులకు ఆలౌటైంది. భారత్-ఏ బౌలర్లలో గుర్నూర్ బ్రార్, సరాన్ష్ జైన్ చెరో నాలుగు వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటింగ్‌ను కుదేలు చేశారు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు పడగొట్టి సహకారం అందించాడు. ప్రస్తుతం బ్యాటర్లు అదే జోరు కొనసాగిస్తుండటంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించే అవకాశాలు భారత్-ఏకు బలంగా కనిపిస్తున్నాయి.



## భారత్‌తో వన్డే సిరీస్‌కు ఆర్చర్ పునరాగమనం

**లండన్, జులై 3 :**
భారత్‌తో స్వదేశంలో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. దాదాపు ఏడాది తర్వాత స్టార్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ వన్డే జట్టులోకి తిరిగి రావడం విశేషం. అలాగే సస్సెక్స్ ఆల్‌రౌండర్ జేమ్స్ కొల్స్‌కు తొలిసారి వన్డే జట్టులో చోటు లభించింది. వచ్చే వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టును మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఇంగ్లండ్ సెలెక్టర్లు ఈ జట్టును ఎంపిక చేశారు. పూర్తి స్థాయి వన్డే కెప్టెన్‌గా హ్యారీ బ్రూక్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జట్టును ప్రకటించారు. ఇటీవల ఐపీఎల్‌తో పాటు న్యూజిలాండ్‌పై స్వదేశంలో జరిగిన మ్యాచ్‌ల్లో జోఫ్రా ఆర్చర్ ఆకట్టుకునే ప్రదర్శన చేయడంతో అతడికి మళ్లీ జాతీయ జట్టులో అవకాశం లభించింది. గాయాల కారణంగా చాలా కాలంగా జట్టుకు దూరంగా ఉన్న ఆర్చర్ పునరాగమనం ఇంగ్లండ్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూర్చనుంది. ఈ ఏడాది శ్రీలంక పర్యటనకు దూరమైన గస్ అట్కిన్సన్, సకీబ్ మహమూద్‌లను కూడా సెలెక్టర్లు తిరిగి జట్టులోకి తీసుకున్నారు. మరోవైపు శ్రీలంక సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించని ఓపెనర్ జాక్ క్రాలే, పేసర్లు జేమీ ఓవర్టన్, బ్రైడన్ కార్సే, ల్యూక్ వుడ్‌లను జట్టు నుంచి తప్పించారు. భారత్, ఇంగ్లండ్ మధ్య మూడు వన్డేల సిరీస్ జులై 14 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ ఎడ్జ్‌బాస్టన్‌లో, రెండో వన్డే జులై 16న కార్డిఫ్‌లో, మూడో మరియు చివరి వన్డే జులై 19న లార్డ్స్ మైదానంలో జరగనుంది. ఇంగ్లండ్ వన్డే జట్టులో బెన్ డకెట్, జోస్ బట్లర్, జాకబ్ బెథెల్, జో రూట్, టామ్ బ్యాంటన్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), విల్ జాక్స్, జేమ్స్ కొల్స్, సామ్ కరన్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్, సకీబ్ మహమూద్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్ చోటు దక్కించుకున్నారు.

# రెండో టీ20కు సర్వం సిద్ధం..

## భారత్‌కు శుభవార్తలతో పాటు హెచ్చరిక

మాంచెస్టర్, జులై 3 :
భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల ట్వంటీ-20 సిరీస్‌లో రెండో మ్యాచ్ శనివారం మాంచెస్టర్‌లో జరగనుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందగా, రెండో మ్యాచ్‌కు ముందు రెండు శుభవార్తలు, ఒక ఆందోళన కలిగించే అంశం భారత జట్టుకు ఎదురైంది. ఇరు జట్లూ పూర్తి స్థాయిలో బరిలోకి దిగనున్న నేపథ్యంలో ఆసక్తికర పోరు జరగనుంది. భారత అభిమానులకు ప్రధాన ఊరట ఏమిటంటే ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కానుంది. సాధారణంగా ఇంగ్లండ్‌లో జరిగే మ్యాచ్‌ల కోసం అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండాల్సి వస్తుంది. అయితే ఈసారి సాయంత్రం నుంచే మ్యాచ్ ప్రారంభం కానుండటంతో కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా మ్యాచ్‌ను వీక్షించే అవకాశం అభిమానులకు లభించింది. మరోవైపు యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం దక్కే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. పర్యటనలో ఇప్పటివరకు అతడికి అవకాశం రాకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో బ్యాటింగ్ క్రమంలో మార్పులు చేసి వైభవ్‌ను జట్టులోకి తీసుకురావాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. అతడు జట్టులోకి వస్తే భారత బ్యాటింగ్‌కు మరింత బలం చేకూరుతుందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.




అయితే భారత జట్టును కలవరపెడుతున్న అంశం ఇంగ్లండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ పునరాగమనం. తొలి మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న ఆర్చర్ ఇప్పుడు రెండో మ్యాచ్‌లో ఆడే అవకాశం ఉంది. తొలి మ్యాచ్‌లో భారత్ 189 పరుగుల భారీ స్కోరు నమోదు చేయడంతో ఇంగ్లండ్ బౌలింగ్ వైఫల్యంపై విమర్శలు వచ్చాయి. దీంతో బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ఆర్చర్‌ను బరిలోకి దించాలని ఇంగ్లండ్ జట్టు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఐపీఎల్‌తో పాటు న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఆర్చర్ ప్రస్తుతం మంచి లయలో ఉన్నాడు. అతని వేగవంతమైన బంతులను ఎదుర్కోవడం భారత టాప్ ఆర్డర్‌కు కఠిన సవాలుగా మారే అవకాశం ఉంది. అందువల్ల రెండో ట్వంటీ-20లో బ్యాటింగ్, బౌలింగ్ పరంగా ఇరు జట్ల మధ్య హోరాహోరీ పోరు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మెక్సికో అభిమానుల హడావిడిపై ఇంగ్లండ్ ఆందోళన

**మెక్సికో సిటీ :** ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు చేరుకున్న నేపథ్యంలో మెక్సికో అభిమానుల ప్రవర్తనపై ఇంగ్లండ్ జట్టు ఆందోళన వ్యక్తం చేసింది. ప్రత్యర్థి జట్ల ఆటగాళ్లకు రాత్రిపూట నిద్ర లేకుండా చేయాలనే ఉద్దేశంతో మెక్సికో అభిమానులు



చేస్తున్న హడావిడిని దృష్టిలో ఉంచుకుని తమ జట్టు బస చేసే హోటల్ వద్ద ప్రత్యేక భద్రత కల్పించాలని ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్యను ఇంగ్లండ్ యాజమాన్యం కోరింది. ఇటీవల ఈక్వెడార్ జట్టు బస చేసిన హోటల్ సమీపంలో మెక్సికో అభిమానులు రాత్రంతా టపాసులు కాలుస్తూ, వాహనాల హారన్‌లు మోగిస్తూ తీవ్ర శబ్ద కాలుష్యం సృష్టించారు. దీంతో ప్రత్యర్థి ఆటగాళ్లు విశ్రాంతి తీసుకోలేకపోయినట్లు సమాచారం. ఇదే పరిస్థితి తమకు ఎదురుకాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇంగ్లండ్ జట్టు నిర్ణయించింది. జులై 5న జరిగే పదహారో రౌండ్ మ్యాచ్‌లో మెక్సికోతో ఇంగ్లండ్ తలపడనుంది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ ప్రధాన శిక్షకుడు థామస్ తుచెల్, జట్టు కెప్టెన్ హ్యారీ కేన్ ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య అధికారులను కలిసి తమ జట్టు బస చేసే హోటల్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మ్యాచ్‌కు ముందు రాత్రి ఆటగాళ్లు ప్రశాంతంగా నిద్రపోయేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన నిర్వాహకులు ఇంగ్లండ్ జట్టు బస చేసే హోటల్ పరిసరాల్లో భద్రతను మరింత పెంచడంతో పాటు అవసరమైతే సమీప రహదారులను తాత్కాలికంగా మూసివేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మెక్సికో అభిమానులు హోటల్ సమీపానికి చేరకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం. ఇంగ్లండ్, మెక్సికో మధ్య జరిగే ఈ కీలక పోరు సముద్ర మట్టానికి సుమారు 2,240 మీటర్ల ఎత్తులో ఉన్న ఎస్తాడియో అజ్టెకా మైదానంలో జరగనుంది. ఈ ఎత్తులో గాలి సాంద్రత తక్కువగా ఉండటంతో బంతి వేగం, దిశలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అందుకే మ్యాచ్‌కు రెండు రోజుల ముందుగానే ఇంగ్లండ్ జట్టు మెక్సికో చేరుకుని సాధన ప్రారంభించింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించనుంది. దీంతో మైదానంలోని ఆటతో పాటు మైదానం వెలుపల కూడా ఆటగాళ్లకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ఇంగ్లండ్ జట్టు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది.

## ధోనీ, జొకోవిచ్ ఇద్దరిలోనూ అదే ప్రత్యేకత

**లండన్ :** టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, టెన్నిస్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్‌లపై భారత మహిళల క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. అత్యంత ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లోనూ వారిద్దరూ ప్రదర్శించే ప్రశాంతత, మానసిక దృఢత్వం ఒక్కటేనని కొనియాడింది. ప్రస్తుతం లండన్‌లో జరుగుతున్న వింబుల్డన్ టోర్నమెంట్‌ను ప్రత్యక్షంగా వీక్షిస్తున్న దీప్తి, జొకోవిచ్ ఆటతీరును ప్రశంసించింది. జియో హాట్‌స్టార్ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. క్లిష్ట సమయాల్లో జొకోవిచ్ వెనుకడుగు వేయడని, ధోనీ కూడా మైదానంలో అంతే ప్రశాంతంగా ఉంటూ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటాడని చెప్పింది. ఈ ఇద్దరి దిగ్గజాల నుండి క్లిష్ట పరిస్థితులను ఎలా అధిగమించాలో నేర్చుకోవచ్చని తెలిపింది. వింబుల్డన్‌లో మ్యాచ్ చూడటం తన చిరకాల కల అని, తనకు అత్యంత ఇష్టమైన టెన్నిస్ స్టార్ జొకోవిచ్ అని వెల్లడించింది. సచిన్ టెండూల్కర్, సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి వంటి దిగ్గజాలతో కలిసి వింబుల్డన్ చూడటం తనకిష్టమని దీప్తి పేర్కొంది. ఇటీవల మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ కూడా వింబుల్డన్ మ్యాచ్‌లను వీక్షించిన సంగతి తెలిసిందే.



# ఎఐ సాయంతో డీప్‌ఫేక్ చిత్రాలు

## బాంబే హైకోర్టును ఆశ్రయించిన ప్రీతిజింతా



బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతీ జింతా తన అనుమతి లేకుండా కృత్రిమ మేధస్సు అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను ఉపయోగించి సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అభ్యంతరకరమైన కంటెంట్‌కు వ్యతిరేకంగా బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఇంటర్నెట్ లోని వివిధ వెబ్‌సైట్ల నుండి ఈ అసభ్యకరమైన కంటెంట్‌ను పూర్తిగా మరియు శాశ్వతంగా తొలగించేలా తక్షణమే అత్యవసర ఉత్తర్వులు జారీ చేయాలని ఆమె న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ మాధవ్ జామదార్ ధర్మాసనం, అంతర్జాలం నుండి ఇలాంటి అభ్యంతరకర కంటెంట్‌ను వేగంగా తొలగించడానికి ఒక సులువైన మరియు ఆచరణాత్మకమైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకూ సూచించింది. కాగా, ఈ వివాదాస్పద అంశంపై తదుపరి విచారణను న్యాయస్థానం జూలై ఆరవ తేదీకి వాయిదా వేసింది. నటి ప్రీతీ జింతా దాఖలు చేసిన ఈ రిట్ వ్యాజ్యంలో ప్రముఖ సామాజిక మాధ్యమ సంస్థలైన గూగుల్, మెటాలతో పాటు పలు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరఫున సీనియర్ న్యాయవాది వెంకటేష్ ధోండ్ కోర్టులో బలమైన వాదనలు వినిపిస్తూ, రోజురోజుకూ ఈ డీప్‌ఫేక్ సాంకేతికత యొక్క నాణ్యత మరియు స్పష్టత విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల బాధితులకు జరిగే నష్టాన్ని నివారించడానికి సదరు అభ్యంతరకర లింకులను తక్షణమే బ్లాక్ చేసేలా స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరోవైపు గూగుల్, మెటా సంస్థల తరఫు న్యాయవాదులు న్యాయస్థానం ముందు స్పందిస్తూ, వివాదాస్పదంగా మారిన సదరు లింకులను తమ ప్లాట్‌ఫారమ్‌ల నుండి తొలగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే, ఇంటర్నెట్ లోని సాధారణ మరియు చట్టబద్ధమైన కంటెంట్‌ను ముందుస్తుగానే పర్యవేక్షించి పూర్తిగా బ్లాక్ చేయాలనే కఠినమైన నిబంధనలను మాత్రం తమపై విధించవద్దని వారు న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న గౌరవ న్యాయమూర్తి, అంతర్జాలంలో ఉండే సాధారణ సమాచారానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా, కేవలం ఫిర్యాదులో పేర్కొన్న అభ్యంతరకర లింకులను మాత్రమే త్వరితగతిన తొలగించేలా ఒక స్పష్టమైన ప్రాక్టికల్ ప్రోటోకాల్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చట్టపరిధిని దాటకుండా సాంకేతిక పరిజ్ఞాన దుర్వినియోగాన్ని అడ్డుకోవడమే కోర్టు ముఖ్య ఉద్దేశమని ధర్మాసనం స్పష్టం చేసింది.

# హృత్రిక్, సుసానే విడాకులు

## భరణంగా 400 కోట్లు అంటూ వైరల్



హృతిక్ రోషన్, సుసానే ఖాన్ విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. విడాకుల తర్వాత సుసానే రూ.400 కోట్ల భరణం డిమాండ్ చేశారనే వార్తలు వైరల్ అయ్యాయి. వాటిపై ఆమె సోదరి ఫరాఖాన్ తాజాగా స్పందించారు. ఈ విడాకులు ఇరువర్గాల అంగీకారంతోనే జరిగాయని.. ఇప్పటికీ రెండు కుటుంబాల మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. హృతిక్ సుసానే విడాకులపై సోషల్ మీడియాలో, బయటా పెద్ద రచ్చ జరిగింది. వారి వ్యక్తిగత జీవితంపై చాలా మంది రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కానీ, వారిద్దరూ ఆ క్లిష్ట పరిస్థితిని ఎంతో గౌరవప్రదంగా, హుందాగా ఎదుర్కొన్నారు. ఇక.. సుసానే రూ.400 కోట్ల భరణం తీసుకున్నారన్న వార్తల్లో నిజం లేదు. భరణం తీసుకుని ఆమె మరింత ధనవంతురాలయ్యారని కామెంట్స్ చేస్తున్నారు. అవి చూసి నా మనసు ఎంతో బాధపడుతోంది. ఆ వార్తలు పచ్చి అబద్ధం అని స్పష్టం చేశారు. దీంతో ఈ వార్తలకు బ్రేక్ పడింది. హృతిక్ రోషన్, సుసానే ఖాన్ డిసెంబర్ 2014లో అధికారికంగా విడాకులు తీసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు (రెహాన్, హ్రిదాన్) ఉన్నారు. విడాకులు తీసుకున్నప్పటికీ.. తాము మంచి స్నేహితులుగా ఉంటూ తమ పిల్లల బాధ్యతలను చూసుకుంటున్నట్లు హృతిక్ తెలిపారు.

# 'రావు బహదూర్' మూవీ రివ్యూ

'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ వెంకటేష్ మహా దర్శకత్వంలో సత్యదేవ్ నటించిన వైవిధ్యమైన సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్'. మహేష్ బాబు సమర్పణలో వచ్చిన ఈ చిత్రం, 1968-1991 కాలంలో సాగే ఒక రాజవంశీకుడి కథ. క్యాన్సర్‌తో బాధపడుతూ, కొన్ని నెలల ఆయుష్షు మాత్రమే ఉన్న రామప్ప (సత్యదేవ్) ఒక తీవ్రమైన మానసిక రుగ్మత, అనుమానంతో చుట్టూ ఉన్నవారిని ఎలా ఆటాడుకున్నాడు? అతని గతం ఏంటి? అనేదే సినిమా కథాంశం. దీని ద్వారా దర్శకుడు సమాజంలోని కుల వివక్ష, వారసత్వ పిచ్చిని బలంగా ప్రశ్నించారు. సినిమా ప్రారంభం ఆసక్తికరంగా ఉన్నప్పటికీ, కథనం చాలా నెమ్మదిగా సాగడం వల్ల అసలు కథ ఏంటో తెలియడానికి ఇంటర్వెల్ వరకు ఆగాల్సి వస్తుంది. అయితే, సెకండాఫ్‌లో హీరో ఫ్లాష్‌బ్యాక్, పోలీస్ క్యారెక్టర్ ఎంట్రీతో సినిమా వేగం పుంజుకుంటుంది. క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. కథనంలో అక్కడక్కడా సాగతీత ఉన్నా, సత్యదేవ్ అద్భుత నటన, విభిన్నమైన పాయింట్ కోసం ఈ సినిమాను ఒకసారి చూడవచ్చు.

# నాగబంధం గ్రాఫిక్స్ హైలైట్

## కథా కథనంలో కనిపించని పట్టు




సినిమా నిర్మాణ దశ నుంచే తెలుగు ఆడియెన్స్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించిన చిత్రం నాగబంధం. భారీ గ్రాఫిక్ హంగులతో విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించగా, అభిషేక్ నామా దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో ఈ సినిమా శుక్రవారం విడుదలై ప్రేక్షకులను మెప్పించింది. అనాథ అయిన రుద్ర (విరాట్ కర్ణ)ను పద్మమ్మ (శరణ్య) చేరదీసి సొంత కొడుకులా పెంచుతుంది. తన చెల్లెలి (సోనియా సింగ్) పెళ్లిని రాజు అనే యువకుడితో ఘనంగా చేయాలని రుద్ర అనుకుంటాడు. సరిగ్గా పెళ్లి సమయంలో రంగనాథ స్వామి ఆలయంలోని బ్రహ్మకమలం కోసం రుద్ర కుటుంబంపై జుల్ఫికర్ అలీ (రిషబ్) దాడి చేస్తాడు. ఈ ప్రమాదంలో రుద్ర ఫ్యామిలీలోని అందరూ చనిపోతారు. వేల ఏళ్లుగా రంగనాథ స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న బ్రహ్మకమలంతో రుద్రకు ఉన్న సంబంధం ఏమిటి? ఆ బ్రహ్మకమలాన్ని దొంగతనం చేయాలని ఆర్కియాలజిస్ట్ ప్రభాకర్ (జగపతిబాబు)తో పాటు అతని కూతురు పార్వతి (నభా నటేష్) ఎలాంటి ప్రయత్నాలు చేశారు? ఆలయంలోని బ్రహ్మకమలం, గరుడ మంత్రాలతో పాటు నాగబంధం గ్రంథం సాయంతో అమరత్వం పొందాలని జుల్ఫికర్ అలీ, భైరాగి (గరుడ రామ్) ఎలాంటి మారణహోమానికి పాల్పడ్డారు? కైలాస పర్వతంలోని విరాటస్వామి ఆలయంలోని ఓ గదిలో ఉన్న రహస్యం ఏమిటి? 17వ శతాబ్దంలో హిందూ దేవాలయాలను దోచుకున్న అబ్దాలీని నాగసాధువు ఎలా నిలువరించాడు? అన్నదే నాగబంధం మూవీ కథ. కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయానికి నాగబంధం రక్షణగా ఉందనే కథ ప్రచారంలో ఉంది. ఆ నాగబంధాన్ని విచ్ఛిన్నం చేయాలంటే గరుడ మంత్రాలు తెలిసి ఉండాలని పురాణాల్లో రాసి ఉంది. ఈ పాయింట్ నుంచే దర్శకుడు అభిషేక్ నామా స్ఫూర్తి పొంది నాగబంధం కథను రాసుకున్నారు. ఈ చిన్న పాయింట్‌కు సనాతన ధర్మం, హైందవ సంస్కృతితో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్‌స్టోరీని జోడించి సినిమాను రూపొందించారు. నాగబంధం విముక్తి కోసం ప్రయత్నించే అసాంఘిక శక్తులు, దేవుడి అండతో వారిని ఎదుర్కొనే సామాన్యుడైన హీరో.. ఈ అంశాల చుట్టే నాగబంధం కథ సాగుతుంది. ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంటుంది. అబ్బురపరిచే సెట్స్, అదిరిపోయే గ్రాఫిక్స్ లార్జర్ దేన్ లైఫ్‌లాంటి అనుభూతిని అందిస్తాయి. యాక్షన్ ఎపిసోడ్స్ బాగున్నాయి. భైరవకోన ఎపిసోడ్, మానసాదేవి టెంపుల్‌లో జరిగే ఫైట్‌తో పాటు అబ్దాలీ మనుషులకు, నాగసాధువులకు మధ్య జరిగే వార్ సీన్లు గూస్‌బంప్స్ కలిగిస్తాయి. అయితే యాక్షన్ సీక్వెన్స్‌లు సుదీర్ఘంగా సాగడం మాత్రం సినిమాకు మైనస్‌గా మారింది. నాగబంధం కథను మొదలుపెట్టిన తీరు బాగుంది. ఫ్యామిలీ సీన్లు కథకు పెద్దగా అతకలేదు. కథ మొత్తం బ్రహ్మకమలం చుట్టే తిరగడంతో సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. రెండు డిఫరెంట్ షేడ్స్‌తో సాగే పాత్రలో హీరోగా విరాట్ కర్ణ మెప్పించాడు. నాగసాధువుగా అతని లుక్ బాగుంది. యాక్షన్ సన్నివేశాల్లో మెప్పించినా, ఎమోషనల్ సీన్ల పరంగా ఇంకా పరిణితి చూపించాల్సి ఉంది. నభా నటేష్‌కు మంచి రోల్ దక్కింది. పాజిటివ్, నెగెటివ్ కోణాల్లో ఆమె పాత్ర సాగుతుంది. కొద్దిసేపు డ్యూయల్ రోల్‌లో కనిపిస్తుంది. విలన్‌గా రిషబ్ డైలాగ్ డెలివరీ, బాడీలాంగ్వేజ్ విభిన్నంగా ఉన్నాయి. మరో హీరోయిన్ ఐశ్వర్య మీనన్‌కు ఒకటి రెండు డైలాగ్స్ తప్ప పెద్దగా ఇంపా÷–ట్గ÷న్స్ లేదు. జగపతిబాబు, మురళీ శర్మ, మహేష్ మంజ్రేకర్, శరణ్య, అనసూయ, సోనియా సింగ్, అంకిత్ కొయ్యతో పాటు సినిమాలో చాలామందే యాక్టర్లు కనిపిస్తారు కానీ, తమ నటనను చాటిచెప్పే అవకాశం ఎవరికీ దక్కలేదు. విజువల్స్, గ్రాఫిక్స్ పై పెట్టిన శ్రద్ధ కథపై కూడా పెట్టి ఉంటే నాగబంధం రిజల్ట్ మరోలా ఉండేది. చిన్న చిన్న లోపాలున్నా నాగబంధం ప్రేక్షకులను కొంతవరకు మెప్పిస్తుంది.

# మా ఇంటి బంగారం ఓ మంచి సినిమా

## సమంతకు కంగ్రాట్స్ చెప్పిన లెనిన్ అఖిల్




అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమా జులై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు అఖిల్. ఇక చిత్ర ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ తాజా ఇంటర్వ్యూలో ఆయన టాలీవుడ్ రీసెంట్ ఇండస్ట్రీ హిట్ 'మా ఇంటి బంగారం' సినిమా గురించి అందులో సమంత నటన గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'లెనిన్' ప్రమోషన్స్ బిజీ వల్ల తాను ఇంకా 'మా ఇంటి బంగారం' సినిమా చూడలేదని, కానీ ఆ చిత్ర ట్రైలర్ చూశానని అఖిల్ వెల్లడించారు. ట్రైలర్ వైబ్ అద్భుతంగా ఉందని, చూసినప్పుడే ఇది కచ్చితంగా పెద్ద హిట్ అవుతుందని తనకు అనిపించిందని చెప్పారు. ఒక మంచి ఇంటికి కోడలిగా వెళ్లి, ఆ కుటుంబ సభ్యులందరితో బంగారం అనిపించుకోవాలనే చక్కటి ఫ్యామిలీ ఎలిమెంట్‌కు పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి సినిమాను చాలా కొత్త కాన్సెప్ట్‌తో, సహజంగా తెరకెక్కించారని ఆయన ప్రశంసించారు. ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో ఆ స్థాయి యాక్షన్ సీన్స్ చేయించడం నిజంగా అద్భుతమని కొనియాడారు. ఈ చిత్రంలో సమంత పాత్రను అద్భుతంగా పండించిందని మెచ్చుకుంటూ, కంగ్రాట్స్ సామ్ అంటూ సమంతతో పాటు 'మా ఇంటి బంగారం' చిత్రబృందానికి అఖిల్ తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విడాకుల తర్వాత కూడా అక్కినేని కుటుంబ సభ్యులతో, ముఖ్యంగా అఖిల్‌తో సమంతకు ఉన్న ఈ రిలేషన్ పరస్పర గౌరవం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఇకపోతే అఖిల్ అక్కినేని కెరీర్‌లో ఇప్పటివరకు ఆశించిన స్థాయి విజయం అందుకోలేకపోయినా, కొత్త ఉత్సాహంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం లెనిన్ జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అఖిల్ తన కెరీర్, మూడు సంవత్సరాల విరామం, భవిష్యత్ ప్రణాళికలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూడు సంవత్సరాలుగా తన నుంచి సినిమా రాకపోవడంతో అభిమానులు నిరాశ చెందారని అఖిల్ అన్నారు. ఇంత పెద్ద గ్యాప్ వచ్చినందుకు ముందుగా అభిమానులందరికీ క్షమాపణలు చెబుతున్నాను. కానీ ఇకపై సినిమాల మధ్య ఇంత విరామం ఉండదన్నాడు. వరుసగా సినిమాలు చేస్తాను. ఒకవేళ మళ్లీ ఇంత సమయం తీసుకుంటే మా ఇంటికొచ్చి నన్ను కొట్టండి. ఆ బాధ్యతను నేనే తీసుకుంటున్నాను అంటూ ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. గత కొద్ది రోజులుగా విశ్రాంతి లేకుండా పని చేస్తున్నా, అభిమానుల ప్రేమ, ఉత్సాహం నాకు కొత్త శక్తిని ఇచ్చాయి. ఈసారి నన్ను నమ్మండి అని ఆయన అన్నారు. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న 'లెనిన్'లో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com